మంగళవారం
13-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 53
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పాకిస్తాన్ ఐఎస్ఐ మాజీ చీఫ్ అరెస్ట్

ఇస్లామాబాద్ :
ఐఎస్ఐ మాజీ చీఫ్ జనరల్ ఫయాజ్ హమీద్‌ను పాకిస్తాన్ సైన్యం అరెస్టు చేసింది. హౌసింగ్ కుంభకోణానికి సంబంధించి అతనిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అదుపులోకి తీసుకున్నట్లు పాకిస్తాన్ సైన్యం తెలిపింది. పాకిస్తాన్ సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు వివరించింది. 'టాప్ సిటీ కేసులో విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ ఫైజ్ హమీద్‌పై వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు సైన్యం అదుపులోకి తీసుకుంది. ఆర్మీ చట్టంలోని నిబంధనల ప్రకారం ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నారు' అని ఐఎస్ఐ ప్రజాసంబంధాల విభాగం పేర్కొంది.

నీరున్నా... విత్తనం కరువే!

- 'జేజీఎల్ 384' రకానికి డిమాండ్
- బ్లాక్‌లో అధిక ధరకు విక్రయాలు
- దిక్కుతోచని స్థితిలో సాగర్ ఆయకట్టు రైతులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
పుష్కలంగా నీరున్నప్పటికీ విత్తనాలు లభించకపోవడంతో సాగర్ కుడికాల్వ ఆయకట్టు ప్రాంత రైతులు వరి సాగుకు ఇబ్బందులెదుర్కొంటున్నారు. రైతులు అత్యధికంగా వినియోగిస్తున్న జేజీఎల్ 384రకం విత్తనాలు మార్కెట్‌లో అందుబాటు లేవు. ఇప్పటికే అక్కడక్కడా రైతుల ఆందోళనలతో ప్రభుత్వం మేల్కొని, కాస్త దిద్దుబాటు చర్యలకు దిగినా...సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలతో ఎగువ నుంచి వచ్చిన వరదలకు శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలు నిండుకుండల్లా మారాయి. అవసరానికి నీటిని ఉంచి, మిగులు జలాలను దిగువకు, కాల్వలకు వదిలేస్తున్నారు. సాగర్ ఆయకట్టు కుడికాల్వ పరిధిలో గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలోని కొంత భాగం ఉంటుంది. ఈ ప్రాంతంలో మొత్తంగా 4.50లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తారు. రెండేళ్ల నుంచి సాగునీటి ఇబ్బందితో చాలా మంది సాగుకు ఆసక్తి చూపలేదు. ఈ ఖరీఫ్ నాటికి భారీ వర్షాలతో సాగర్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందుబాటులోకి రావడంతో ఎక్కువ మంది రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. దీనికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విత్తనాలు సరఫరాకు సిద్ధం కాలేకపోయింది. పాత విధానంలోనే విత్తనాలను అధికారులు అందుబాటులో ఉంచినప్పటికీ, పెరిగిన డిమాండ్‌తో విత్తనాలకు కొరత ఏర్పడింది. రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయకుండా, అవసరం లేని విత్తనాలను అందుబాటులో ఉంచడంతోనే ఈ సమస్య ఉత్పన్నమైంది.

జేజీఎల్ 384 విత్తనంపైనే రైతుల ఆసక్తి

రైతులు జేజీఎల్ 384 రకం విత్తనాలపైనే ఆసక్తి చూపుతున్నారు. ఆ తర్వాత మిగిలిన రకం విత్తనాలపై దృష్టి పెడుతున్నారు. వరి పంట సాగు చేసే బీపీటీ 5204తోపాటు చిన్నపాటి రకం విత్తనాలకే ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ఈ బీపీటీ వరిపంట కాల వ్యవధి 150రోజులు ఉంది. జేజీఎల్ 384 రకం వరి పంట కాల్వ వ్యవధి 135 రోజులే. జేజీఎల్ 384 రకం ద్వారా తక్కువ సమయంలో పంట చేతికి రావడంతోపాటు, తెగుళ్ల ఎదుర్కొనే గుణం ఉంది. ప్రస్తుతం పంట

- మిగతా 2 లో

రాజీపడిన సెబీ విశ్వసనీయత

రాహుల్ గాంధీ విమర్శ

న్యూఢిల్లీ:
సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్, ఆమె భర్త వాటాలు కొనుగోలు చేశారంటూ హిండెన్‌బర్గ్ విడుదల చేసిన నివేదికపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. చిన్న రిటైల్ వ్యాపారుల సంపదకు భద్రత కల్పించే బాధ్యతను అప్పగించిన సెక్యూరిటీస్ రెగ్యులేటర్ అయిన సెబీ విశ్వసనీయత ఆ సంస్థ చైర్‌పర్సన్‌పై వచ్చిన

- మిగతా 2 లో

సత్తాచాటిన ఏయూ

ఎన్ఐఆర్ఎఫ్ రాష్ట్ర వర్సిటీల విభాగంలో 7వ స్థానం

విశాలాంధ్ర–విశాఖపట్నం:
ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో సత్తా చాటింది. సోమవారం సాయంత్రం కేంద్ర విద్యశాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో తొలిసారిగా ప్రకటించిన రాష్ట్ర విశ్వవిద్యాలయాల విభాగంలో జాతీయ స్థాయిలో 7వ స్థానంలో నిలిచింది. అలాగే జాతీయ స్థాయిలో ఓవరాల్ విభాగంలో 41వ ర్యాంకు సాధించింది. గత సంవత్సరం ఓవరాల్ ర్యాకింగ్‌లో 76వ స్థానంలో నిలిచిన ఏయూ

- మిగతా 2 లో

పిన్నెల్లి బెయిల్ విచారణ మళ్లీ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి :
మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. సోమవారం పిన్నెల్లి బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణకు వచ్చింది. గతంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి వద్దకే ఈ పిటిషన్ వెళ్లాలని హైకోర్టుకు పోలీసుల తరపు న్యాయవాది అశ్వనీకుమార్ సూచించారు. అయితే రోస్టర్ ప్రకారం ప్రస్తుతం ఉన్న కోర్టులోనే విచారించాలని పిన్నెల్లి తరపు

- మిగతా 2 లో

ఇక పీపీపీ ఆసుపత్రులు

- స్థాపన కోసం ఉచితంగా స్థలం
- ప్రభుత్వ ఆసుపత్రులతో కలిపి నిర్వహణ
- అత్యుత్తమ వైద్యసేవలే లక్ష్యం

సీఎం చంద్రబాబు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:
త్వరలో ప్రతి నియోజకవర్గ స్థాయిలో పేదలకు ఆధునిక వైద్యసేవలందించేలా సకల సౌకర్యాలతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో (పీపీపీ విధానంలో) ఆసుపత్రుల నిర్మాణం చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ విధానంలో ఆసుపత్రి ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వమే స్థలం అందిస్తుందన్నారు. ప్రభుత్వ, పీపీపీ ఆసుపత్రులను ఒకే గొడుగు

- మిగతా 2 లో

వైసీపీకి ఎమ్మెల్సీ ఎన్నిక పరీక్ష

నేడు, రేపు ఉమ్మడి విశాఖ నేతలతో జగన్ భేటీలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
విశాఖ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వైసీపీకి పెద్ద పరీక్షగా మారింది. ఈ ఎన్నికల్లో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన అనంతరం తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల్లో వైసీపీ మళ్లీ బరిలోకి దిగింది. వాస్తవంగా ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో వైసీపీకే 600కు పైగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఓటర్లు ఉన్నారని, ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. తమకున్న బలం ఆధారంగా ఎన్నికకు పోటీకి అభ్యర్థిని దింపామని, తామే గెలుస్తామని వైసీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దఫాలుగా ఆ ప్రాంత ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో భేటీలు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పార్టీ ప్రజా ప్రతినిధులతో జగన్ మంగళ, బుధవారాల్లో భేటీలు నిర్వహిస్తారు. దీని దృష్ట్యా ఇతరులను కలిసేందుకు అవకాశం లేదని పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది. జగన్ జిల్లాకు చెందిన పార్టీ ప్రజా ప్రతినిధులతో సమావేశం అవుతారు. ఇప్పటికే ఐదు నియోజకవర్గాల జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో సమావేశమయ్యారు. ఈ ఉప ఎన్నికకు ఆ పార్టీ తరపున మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను బరిలో నిలిపారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో వైసీపీకి అత్యధికంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఓట్లు ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని బొత్స పేరును ఖరారు చేయగా, ఆయన సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అటు ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జ్ వైవీ సుబ్బారెడ్డి అధ్వర్యంలో ఆ ప్రాంత నేతలు పార్టీ అభ్యర్థి బొత్స గెలుపు కోసం ప్రచారంలో నిమగ్నమయ్యారు.

టీచర్ల పని సర్దుబాటు వాయిదా

ఫ్యాప్టో నిరసనతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) తీవ్రంగా నిరసించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిసర్దుబాటు ప్రక్రియను ఫ్యాప్టో బహిష్కరించింది. ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి, కో–చైర్మన్లు చందోలు వెంకటేశ్వర్లు, కె.ప్రకాశ్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్.వెంకటేశ్వర్లు, కె.భాను మూర్తి తదితరులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై విద్యాశాఖాధికారులు ఈనెల 9వ తేదీన ఆన్‌లైన్ సమావేశం నిర్వహించగా, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఫ్యాప్టో తీసుకున్న నిర్ణయానికి పీఆర్టీయూ, ఆర్‌యూపీపీ, ఎస్‌ఎల్‌టీఏ, ఏపీ పీఈటీ, అండ్ ఎస్‌ఏ (పీడీ) మద్దతిచ్చాయి. తమ డిమాండ్లను పరిష్కరించాలని, ఆ మేరకు భౌతికంగా

- మిగతా 2 లో

వైద్య సేవలకు అంతరాయం

- దేశవ్యాప్తంగా వైద్యుల నిరవధిక సమ్మె
- కోల్‌కతా ఘటనకు నిరసనగా ఉధృత ఆందోళన

కోల్‌కతా/న్యూఢిల్లీ:
కోల్‌కతాకు చెందిన ఆర్‌జీ కర్ ఆస్పత్రి వద్ద ఒక జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా దేశంలోని అనేక ప్రాంతాల్లో వైద్యులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేయాలని, వైద్య సిబ్బంది అందరికీ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్లు, ఇంటర్న్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రయినీలు మహిళా వైద్యురాలి మృతిపై మెజిస్టీరియల్ విచారణ కోరుతూ సమ్మెను కొనసాగించడంతో వరుసగా నాలుగో రోజు ఆస్పత్రుల్లో సేవలు నిలిచిపోయాయి. 'మా సహోద్యోగి హత్యపై సీబీఐ లేదా సిట్టింగ్ మేజిస్ట్రేట్ ద్వారా నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని మేము కోరుకుంటున్నాం. ప్రస్తుత పోలీసుల విచారణపై అసంతృప్తితో ఉన్నాం. న్యాయం జరిగే వరకు మా నిరసన కొనసాగుతుంది' అని నిరసనకారులు స్పష్టం చేశారు. ఇక దేశ రాజధాని దిల్లీలోని మౌలానా ఆజాద్ వైద్య కళాశాల, ఆర్‌ఎంఎల్ ఆస్పత్రి, లేడీ హార్డింగ్ వైద్య కళాశాల, వీఎంఎంసీ–సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రి, జీటీబీ, ఐహెచ్‌బీఏఎస్, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వైద్య కళాశాల ఆస్పత్రి, జాతీయ టీబీ, శ్వాసకోశ వ్యాధుల ఆస్పత్రితో సహా 10 ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమ్మె ప్రారంభమైంది. గురువారం రాత్రి కోల్‌కతాలోని ప్రభుత్వాస్పత్రి సెమినార్ హాల్‌లో 32 ఏళ్ల ట్రయినీ వైద్యురాలి మృతదేహం లభ్యమైంది. ప్రాథమిక శవపరీక్ష నివేదిక ప్రకారం, బాధితురాలి కళ్లు, నోరు, ప్రైవేట్ భాగాల నుంచి రక్తం కారుతోంది. అలాగే ఆమె ఎడమ కాలు, మెడ, కుడి చేయి, ఉంగరపు వేలు, పెదవులపై గాయాలు కూడా ఉన్నాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం

- మిగతా 2 లో

ఆదివారం వరకే గడువు

డాక్టర్ హత్యపై పోలీసులకు మమత హెచ్చరిక

కోల్‌కతా:
జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేస్తోంది. నిందితుడికి కఠినంగా శిక్ష పడాలంటూ వైద్యులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ కేసుపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోలీసులకు అల్టిమేటం ఇచ్చారు. వారం

- మిగతా 2 లో

మాకు సంఖ్యా బలం ఉంది

ఉమ్మడి విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స నామినేషన్

ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. బొత్స నివాసానికి పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటి నుంచి విశాఖ కలెక్టరేట్‌కు బొత్స బయలుదేరి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఆరో రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి.

2లో

పోటీపై కూటమిలో వీడని సస్పెన్స్

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక విషయంలో అభ్యర్థి ఎంపికపై టీడీపీ కూటమిలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది.

6 లో

ఇదీ లోకం!

సారీ... బ్లీచింగ్‌కి మాత్రం దబ్బులు అడగొద్దు!

క్రీడలపై కేంద్రం నిర్లక్ష్యం

- అందుకే ఒలింపిక్స్‌లో నిరాశాజనక ఫలితాలు
- నిరుద్యోగం, రైతు ఆత్మహత్యల్లో ముందున్నాం
- ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాల్లో రామకృష్ణ

విశాలాంధ్ర–గుంటూరు కలెక్టరేట్:
కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే ఒలింపిక్స్‌లో భారత్‌కు నిరాశాజనక ఫలితాలు వచ్చాయని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. అమెరికా, చైనా, జపాన్ వంటి దేశాలు అద్భుత ప్రతిభ చూపుతుంటే... భారత్ మాత్రం 71వ స్థానానికి పరిమితమైందన్నారు. నిరుద్యోగం, పేదరికం, రైతుల ఆత్మహత్యల్లో మోదీ సర్కారు ముందు వరుసలో ఉందని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాలు గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సదస్సుకు రామకృష్ణ మాట్లాడుతూ అంబానీ, అదానీ సంక్షేమమే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం పని చేస్తోందని, దేశ సంపదను వారికే దోచిపెడుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో నగరం బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్‌ను వేలాది మంది విద్యార్థులు స్థాపించారని గుర్తు చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య సభ్యులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని అన్నారు. స్వాతంత్ర్యం సాధించుకున్న తర్వాత దేశంలో అనేక విద్యార్థి ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జాన్సన్ బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమలు

- మిగతా 2 లో

వడ్డీతో నడ్డి విరుగుతోంది!

- ఏజెన్సీలో జోరుగా ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారం
- రుణాల షరతుల ఉచ్చులో అమాయకులు
- రూ.కోట్లలో లావాదేవీలు

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం ఏజెన్సీ ప్రాంతంలో కీర్తన, స్పందన వ్యాపారం జోరుగా సాగుతోంది. మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ఒక్కో జోడికి రూ.30 వేలు నుంచి రూలక్ష వరకు ముట్టచెబుతున్నారు. ఏంటి... ఇది కాస్త వినడానికి విడ్డూరంగా, ఆశ్చర్యంగా ఉందే అని అనుకుంటున్నారా... అలాగైతే మీరు పొరబడినట్టే. అసలు ... కీర్తన, స్పందన ఎవరు. ఏజెన్సీలో వారి వ్యాపారమేమిటో తెలుసుకుందాం.

6 లో

హసీనా కొంపముంచిన సెయింట్ మార్టిన్స్ ద్వీపం

ఢాకా: బంగ్లాదేశ్ అల్లకల్లోలం వెనుక అమెరికా హస్తం ఉన్నట్లు తాజాగా వార్తలు వస్తున్నాయి. గతంలో మాజీ ప్రధాని షేక్ హసీనా స్థానిక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సెయింట్ మార్టిన్స్ ద్వీపంలో సైనిక స్థావరం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలంటూ ఓ అగ్రరాజ్యం నుంచి ఒత్తిడి వచ్చినట్లు బాంబు పేల్చారు. దీంతో సెయింట్ మార్టిన్స్ ద్వీపం ఏమిటీ? వ్యూహాత్మకంగా దానికి ఉన్న ప్రాధాన్యం ఎంత అనే అంశం చర్చనీయాంశంగా మారింది. బంగాళా ఖాతంలోని ఈశాన్య భాగంలో దాదాపు మూడు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సెయింట్ మార్టిన్స్ ఐలాండ్ ఉంది. ఇది ఒక పగడపు దీవి. బంగ్లాదేశ్ దక్షిణ భాగంలో ఉన్న కాక్స్ బజార్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఇది ఉంటుంది. స్థానికులు దీనిని నారికేళ్ జింజిరా లేదా కోకోనట్ ఐలాండ్ అని అంటారు. ఈ దీవిలో 3,700 మంది ప్రజలు నివాసం ఉన్నారు. వీరంతా చేపలవేట, వరి సాగు, కొబ్బరి తోటలపై ఆధారపడి జీవిస్తు న్నారు. సీవీడ్ సాగుకు ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. దీనిని మైన్మార్‌కు ఎగుమతి చేస్తారు. 18వ శతాబ్దంలో ఇక్కడ అరబ్ వర్తకులు స్థిరపడ్డారు. వారు దీనికి జజిరా అనే పేరు పెట్టారు. 1900ల్లో ఈ ద్వీపాన్ని బ్రిటీష్ వారు తమ భారత రాజ్యంలో భాగం చేసుకొ న్నారు. క్రిస్టియన్ గురువు సెయింట్ మార్టిన్స్ పేరు పెట్టినట్లు ప్రచారంలో ఉంది. మరోవైపు నాటి చిట్టగాంగ్ డిప్యూటీ కమిషనర్ గౌరవార్థం మార్టిన్ పేరు పెట్టినట్లు తెలుస్తోంది. 1947లో భారత్ విడిపోయిన తర్వాత ఇది తూర్పు పాకిస్థాన్‌లో భాగమైంది. ఆ తర్వాత బంగ్లాదేశ్‌కు దక్కింది. 1974లో దీనిపై బంగ్లా సార్వభౌమత్వాన్ని అంగీకరిస్తూ మైన్మార్ ఒప్పందం చేసుకొంది. ఇక్కడ సముద్ర సరిహద్దుల గుర్తింపు పూర్తి కాలేదు. దీంతో రెండు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. బంగ్లాదేశ్ మత్స్యకారుల పడవలపై మైన్మార్ దళాలు కాల్పులు జరపడం పరిపాటిగా మారింది. మైన్మార్‌లో సైన్యం రోహింగ్యాలపై తీవ్రస్థాయిలో విరుచుకు పడటంతో లక్షల మంది బంగ్లాదేశ్‌కు వలస వచ్చారు. వీరంతా కాక్స్‌బజార్ సమీపంలోని కుటుపలాంగ్ శరణార్థి శిబిరంలో తలదాచుకొన్నారు. వీరికి మద్దతుగా ఉండే అరకాన్ ఆర్మీ ఇటీవల కాలంలో సెయింట్ మార్టిన్స్ ద్వీపంపై హక్కును ప్రకటించుకుంది. కానీ, బంగ్లాదేశ్ ప్రభుత్వం దానిని తోసిపుచ్చింది. మరోవైపు అరకాన్ ఆర్మీ కారణంగా ఈ ద్వీపంపై తరచూ మైన్మార్ దళాలు కాల్పులు జరుపుతుంటాయి. దీంతో బంగ్లాదేశ్ తమ నౌకాదళాన్ని ఇక్కడ మోహరించింది. ఇది బంగాళా ఖాతంలో అనేక దేశాల మధ్యలో ఉండటంతో అమెరికా దృష్టి దీనిపై ఎప్పటి నుంచో ఉంది. ఇక్కడ అమెరికా సైనిక స్థావరం నిర్మిస్తే... ప్రపంచ వాణిజ్యానికి ఎంతో కీలకమైన మలక్కా జలసంధిపై నేరుగా దానికి పట్టు లభిస్తుంది. ఈ ద్వీపంపై ఆసక్తి లేదని అమెరికా అధికారికంగా చెప్పినప్పటికీ ఇక్కడ స్థావరం ఏర్పాటుకు చాలా ప్రయత్నాలు చేసింది. దీనికి సమీపంలో కాక్స్ బజార్ పోర్టును చైనా నిర్మిస్తోంది. అందువల్ల ఈ ద్వీపంలో స్థావరం ఉంటే నిఘాకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని అమెరికా భావిస్తోంది. దీంతోపాటు ఏకకాలంలో ఇక్కడి నుంచి చైనా, మైన్మార్‌పై నిఘా పెట్టేందుకు అవకాశం లభిస్తుంది.

తుర్కియేలో 13 వేల ఏళ్ల నాటి రాతి క్యాలెండర్



గోబెక్లీ టేపే: ప్రపంచంలోనే అతి పురాతనమైన క్యాలెండర్ దక్షిణ తుర్కియేలో లభ్యమైంది. అంతర్జాతీయ మీడియా తెలిపిన వివరాల ప్రకారం తుర్కియేలోని గోబెక్లి టేపే వద్ద పురావస్తు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్న సమయంలో ఒక భారీ రాతి స్తంభం బయటపడింది. దానిపై సూర్యచంద్రులకు సంబంధించిన గుర్తులు, మరికొన్ని ఇతర చిహ్నాలు గుర్తించారు. కాగా ఆ ఆలయం 13 వేల ఏళ్ల నాటిదని, రాతి స్తంభంపై ఉన్న గుర్తులు అప్పటి సూర్యచంద్రుల కాలాలకు సంబంధించినవని పేర్కొన్నారు. ఇటువంటి చిహ్నాలను సుమారు 10,850 బీసీలో చెక్కి ఉంటారని భావిస్తున్నారు. అప్పట్లో దీనిని ఓ క్యాలెండర్‌గా ఉపయోగించి ఉండొచ్చన్నారు. ఈ స్తంభంపై 365 'వి' ఆకారపు చిహ్నాలు చెక్కి ఉన్నాయని, అందులోని ఒక్కో 'వి' ఒక్కో రోజును సూచిస్తోందని పేర్కొన్నారు. ఇందులో 12 చంద్ర నెలలు అదనంగా 11 రోజులు ఉన్నట్లు వివరించారు. అంతేకాకుండా ఓ పక్షిలాంటి ఆకారం చెక్కి దాని చూట్టూ ఒకే విధమైన వి- ఆకారపు చిహ్నాలు రూపొందించారని, ఇవి అప్పటి కాలాలను సూచిస్తున్నాయని వెల్లడించారు. ఇటువంటి క్యాలెండర్ల ద్వారా అప్పటి వారు కాలాలను, వాతావరణాన్ని అంచనా వేసి ఉంటారని తెలిపారు. ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేస్తున్న రచయిత మార్టిన్ స్వెట్‌మాన్ ఈ స్తంభం గురించి మాట్లాడుతూ ఇందులోని చిహ్నాలు అప్పటి పర్యావరణ వ్యవస్థలకు అధారాలని పేర్కొన్నారు. వీటి ఆధారంగా ఆదిమానవులు ప్రపంచాన్ని ఎలా గమనించేవారు తదితర విషయాలు, వారి ఖగోళ, సాంస్కృతిక పద్ధతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

ఇక పీపీపీ ఆసుపత్రులు

(మొదటిపేజీ తరువాయి)

కిందకు తీసుకొస్తామని, దేశంలోనే ఏపీ ఆసుపత్రుల పనితీరు అత్యుత్తమంగా ఉండేలా తీర్చిదిద్దుతామని చంద్రబాబు చెప్పారు. అస్తవ్యస్త విధానాలతో గత ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులను భ్రష్టు పట్టించిందని, తద్వారా ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని సీఎం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మళ్లీ నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలకు అమలు చేయాల్సిన విధానాలపై సీఎం అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. ప్రభుత్వం తరపున యాప్ రూపొందించి హెల్త్ కార్డు ద్వారా ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి సంబంధించిన వివరాలు పొందుపరచాలి. ఆసుపత్రి రోగికి అందించే వైద్య సేవలు, ఎక్విప్ మెంట్, ఇచ్చే మెడిసిన్ వివరాలు కూడా ఉండాలి. ఇలా చేయడం వల్ల ఆసుపత్రి పనితీరు ఎలా ఉందో తెలుస్తుంది.

రాష్ట్రంలో కిడ్నీ బాధితులు ఎంత మంది ఉన్నారో మండలాల వారీగా వివరాలు సేకరించాలి. కిడ్నీ సమస్య కారణాలపై అధ్యయనం చేయాలి. కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నీటి సదుపాయంపైనా లోతైన అధ్యయనం చేయాలని సూచించారు. ఉద్దానంలాగే ఇప్పుడు మరికొన్ని ప్రాంతాల్లో కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయి. పేదలకు అందుబాటులో ఉండేలా సిటీ స్కాన్ సర్వీసెస్‌ను ముందుగా అన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలి. ఆసుపత్రులలో ప్రసవం తర్వాత శిశువుల మిస్సింగ్ కేసులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మిస్సింగ్ కేసులు వస్తే అధికారులపై చర్యలు తప్పవు. ఎన్టీఆర్ బేబీ కిట్స్ ను మళ్లీ తల్లులకు అందించాలి. ప్రతి స్కూలులో పిల్లలకు కంటి పరీక్షలు చేసిన తర్వాత ఏం యాక్షన్ తీసుకున్నారో రిపోర్టు చేయాలి. టెలీ మెడిసిన్ కు గతంలో వరల్డ్ బ్యాంకు నుండి రూ.2,300 కోట్లు నిధులు తీసుకొచ్చాం. కార్పొరేట్ లెవల్లో సేవలు అందించాలని నిర్ణయించాం. మళ్లీ అది అమల్లోకి రావాలి. ఫీడర్ అంబులెన్స్ కు సాధారణ అంబులెన్స్ కు కనెక్టివిటీ పెంచాలి. గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు మళ్లీ రిపీట్ అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఫీడర్ అంబులెన్స్ లు వెళ్లగలిగినప్పటికీ సాధ్యంకాదని నిర్లక్ష్యం వహిస్తే నేరుగా నేనే ఆ ప్రాంతాన్ని సందర్శిస్తానని సీఎం హెచ్చరించారు. ఆసుపత్రుల్లో రోగులకు అందించే దుప్పట్లు కూడా నాణ్యత, శుభ్రంతో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల్లో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మరణాలను తగ్గించాలని సూచించారు. విశాఖ మెడ్ టెక్ జోన్ పట్ల గత పాలకులు నిర్లక్ష్యం వహించారు. యేడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ మెడ్ టెక్ జోన్ ద్వారా జరుగుతోంది. తక్కువ ఖర్చుతో అన్ని రకాల మెడికల్ ఎక్విప్ మెంట్ ను అందిస్తోంది. అయినా దీన్ని గత ప్రభుత్వం వినియోగించుకోలేదని గుర్తు చేశారు. ఏది ఏమైనా ప్రభుత్వ ఆసుపత్రులను దేశానికే ఒక మోడల్‌లా తీర్చిదిద్దేందుకు అసరమైన మెరుగైన విధానాల అమలుకు వైద్యఆరోగ్యశాఖ అధికారులంతా సమిష్టి కృషి చేయాలని కోరారు.

పిన్నెల్లి బెయిల్ విచారణ మళ్లీ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ న్యాయవాది వాదించారు. రెండు పక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి, ఇవన్నీ నిశితంగా పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం కేసు తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 14కు వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మే 13న పాల్వాయి గేట్ గ్రామ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్ ధ్వంసం చేసిన వ్యవహారంలో పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు పిన్నెల్లిపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఆ ధ్వంసాన్ని అడ్డుకున్న టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై ఆయన దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి రెంటచింతల పోలీసులు పిన్నెల్లి, ఆయన అనుచరులు మరో 15 మందిపై హత్యాయత్నం (ఐపీసీ 307), మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేరోజు నాగశిరోమణి అనే మహిళను ఆయన దుర్భాషలాడారు. ఆమె ఫిర్యాదుతో అనేక సెక్షన్ల కింద పిన్నెల్లిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక మే 14న పిన్నెల్లి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి, వారి అనుచరులు సీఐ నారాయణ స్వామిపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై హత్యాయత్నం, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులన్నిటిలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

మాకు సంఖ్యా బలం ఉంది

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. బొత్స నివాసానికి పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటి నుంచి విశాఖ కలెక్టరేట్‌కు బొత్స బయలుదేరి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఆరో రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం 1.45 గంటలకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కలెక్టరేట్‌కు చేరుకొని ఆర్వో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు మూడు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. బొత్స వెంట ఆయన సతీమణి ఝాన్సీ, అరకు ఎంపీ తనూజ రాణి, మాజీ మంత్రి బూడి ముత్యాల నాయుడు, విశాఖ నగర మేయర్ హరివెంకట కుమారి ఉన్నారు. నామినేషన్ దాఖలు చేసిన వెంటనే సంప్రదాయం ప్రకారం బొత్స సత్యనారాయణ ప్రమాణం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరారని, ఈ క్రమంలోనే ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేసినట్లు చెప్పారు. తమకు సంఖ్యా బలం ఉందని, తప్పకుండా విజయం సాధిస్తామని అన్నారు. మాకు 530 మందికి పైగా ప్రజాప్రతినిధుల బలం ఉన్నప్పుడు కూటమి అభ్యర్థిని ఎందుకు బరిలో నిలుపుతోందని ప్రశ్నించారు. ఇదిలాఉండగా, మంగళవారంతో నామినేషన్లకు గడువు ముగుస్తుండగా ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై కూటమిలో గందరగోళం కొనసాగుతూనే ఉంది. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొత్తగా దిలీప్ చక్రవర్తి పేరు తెరపైకి రాగా, ప్రచారంలో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ దూసుకుపోతున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైసీపీకి మరింత బలం పెరిగింది. ఆరు వందలకుపైగా ఓటర్లతో ఇప్పటికే స్పష్టమైన ఆధిక్యత ఉంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 838 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 39 మంది జెడ్పీటీసీల్లో ప్రస్తుతం 36 మంది జెడ్పీటీసీలు ఉన్నారు.

అల్లూరి జిల్లాకు చెందిన హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం అరకు వైసీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రావికమతం జెడ్పీటీసీ తలారి రమణమ్మ, సబ్బవరం జెడ్పీటీసీ తుంపాల అప్పారావు చనిపోయారు. ప్రస్తుతం ఉన్న జెడ్పీటీసీల్లో వైసీపీకి 34 మంది, టీడీపీకి నర్సీపట్నం జెడ్పీటీసీ, సీపీఎంకు అనంతగిరి జెడ్పీటీసీ ఉన్నారు. మొత్తం 652 మంది ఎంపీటీసీలకు గాను 636 మంది ఎంపీటీసీలు ఉన్నారు.

టీచర్ల పని సర్దుబాటు వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం నిర్వహించి ఉత్తర్వులు అమలు చేయాలని ఫ్యాప్టో సూచించింది. దీనికి ఏక పక్షంగా పనిసర్దుబాటు చేయాలంటూ విద్యాశాఖ ఆదేశాలివ్వడాన్ని ఫ్యాప్టో తప్పుపట్టింది. ఆయా అంశాలపై గతంలోనే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, పాఠశాల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఉపాధ్యాయ సంఘాలతో ఎలాంటి చర్చలు నిర్వహించకుండా సర్దుబాటుకు ఉత్తర్వులు జారీచేయగా, దానిపై వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. దీంతో సోమవారం నుంచి జరగాల్సిన పనిసర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా పాఠశాల విద్యశాఖ వాయిదా వేసింది. సీనియార్టీ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 15లోగా తెలియజేయాలని ఆర్జేడీలు, డీఈవోలకు పాఠశాల విద్యాశాఖ సూచనలు చేసింది. ఉపాధ్యాయుల అభ్యంతరాలను పరిష్కరించాక, 16వ తేదీన తుది జాబితా విడుదల చేసి, 17న మండల స్థాయిలో పనిసర్దుబాటు చేయాలని ఆదేశించిందని ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి.

డిమాండ్లు పరిష్కరించాకే సర్దుబాటు చేయండి: ఫ్యాప్టో

ముందు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి... డిమాండ్లను పరిష్కరించాకే పని సర్దుబాటుపై నిర్ణయించాలని ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్ తెలిపారు. పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా అనేక అంశాల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జీవో 117, 128 ద్వారా కాకుండా, 2020లో విడుదల చేసిన జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, ఈ సర్దుబాటులో సీనియర్లకు విల్లింగ్ అవకాశం కల్పించాలని, అనుభవాన్ని లెక్కించే సమయంలో ఫ్యానర్ నంబరు లేదా ర్యాంక్‌ను పరిగణలోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు సూచించారు. పని సర్దుబాటు ప్రక్రియను మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలని, 70 శాతం పైబడిన వికలాంగ ఉపాధ్యాయులకు మినహాయించాలని, 6 నుంచి 10 తరగతులకు 10 సెక్షన్లు దాటిన సందర్భంలో 2 హిందీ, 2 ఫిజికల్ సైన్స్ పోస్టులను కేటాయించాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జీవో 60 ప్రకారం స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ముందు డిమాండ్లు పరిష్కరించాకే.. పనిసర్దుబాటుకు ముందుకెళ్లాలని పట్టుపట్టడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయినట్లు ఫ్యాప్టో నేతలు తెలిపారు.

వైద్య సేవలకు అంతరాయం

(మొదటిపేజీ తరువాయి)

సృష్టించింది. బెంగాల్‌లో సమ్మె ప్రారంభమైనట్లు భారత రెసిడెంట్ వైద్యుల సంఘం సమాఖ్య తెలిపింది. సోమవారం దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన సేవలను నిలిపివేయాలని పిలుపునిచ్చింది. మరోవైపు పశ్చిమ బెంగాల్ వైద్యుల ఫోరం నిష్పాక్షిక విచారణ కమిటీని ఏర్పాటు చేసి దోషులకు ఉరిశిక్ష విధించాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి విజ్ఞప్తి చేసింది. కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్ మూడు రోజుల్లో రెండోసారి ఆదివారం ఆస్పత్రిని సందర్శించి నిరసనకారుల ప్రతినిధులతో సమావేశమయ్యారు. విచారణ పారదర్శకంగా జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రితో సంబంధం లేని పౌర వలంటీర్‌ను అరెస్టు చేశారు.

సమ్మెలో చేరిన ఢిల్లీ ఎయిమ్స్ రెసిడెంట్ వైద్యులు

ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞానాల సంస్థ (ఎయిమ్స్) రెసిడెంట్ వైద్యుల సంఘం (ఆర్‌డీఏ) సోమవారం ఉదయం దేశవ్యాప్త సమ్మెలో చేరింది. రోగుల వార్డులు, ఓపీడీ సహా ఎంపిక చేసిన సేవలను నిలిపివేసింది. అయినప్పటికీ, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు ఇబ్బంది పడకుండా వారికి అత్యవసర సంరక్షణ కొనసాగుతుందని ఎయిమ్స్ ఆర్‌డీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రఘునందన్ దీక్షిత్ తెలిపారు. అనేక ప్రభుత్వ ఆస్పత్రులు ఆదివారం సమ్మెను ప్రకటించగా, ఢిల్లీలోని ఎయిమ్స్ సోమవారం ఉదయం 11.30 గంటలకు సమ్మె ప్రకటించింది. ప్రస్తుతం జరుగుతున్న విచారణ సమగ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, రెసిడెంట్ వైద్యులు ఈ కేసుపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలని, వెంటనే సీబీఐకి బదిలీ చేయాలని కోరారు. 'బాధితురాలి కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలి. ప్రాణాలను రక్షించడానికి ఉద్దేశించిన ప్రదేశంలో ఈ దారుణం జరగడం, సేవ చేసే వారు ఎదుర్కొంటున్న తీవ్రమైన ముప్పును గుర్తు చేస్తుంది. మీడియా, పౌర సమాజ సంస్థలు, ప్రతి ఒక్కరూ ఈ ఆందోళనకు మద్దతుగా నిలబడాలని కోరుతున్నాం' అని డాక్టర్ దీక్షిత్ అన్నారు. కర్నాటకలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర చాప్టర్‌కు చెందిన వైద్యులు దారుణమైన అత్యాచారం, హత్యను తీవ్రంగా ఖండించారు. నిమ్హాన్స్‌లోని రెసిడెంట్ వైద్యులు ఈ సంఘటనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక నిరసన చేపట్టారు. బాధితురాలికి సంఘీభావంగా వైద్యులందరూ నల్ల బ్యాడ్జీని ధరించాలని కోరుతూ పోస్టర్లు, వారి ఆస్పత్రుల్లో సందేశాన్ని ప్రదర్శించాలని కోరారు.

ఆదివారం వరకే గడువు

(మొదటిపేజీ తరువాయి)

రోజుల్లో కేసు పరిష్కరించలేకపోతే సీబీఐకి అప్పగిస్తామన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష బీజేపీ నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్న వేళ పోలీసులకు మమతా బెనర్జీ తుది గడువు విధించారు. మమతా బెనర్జీ సోమవారం మృతురాలి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ కేసులో ఇంకా ఎవరైనా నిందితులు ఉన్నట్లయితే వారందరినీ ఆదివారం లోగా అరెస్టు చేస్తాం. ఒకవేళ అప్పటిలోగా రాష్ట్ర పోలీసులు కేసును పరిష్కరించలేకపోతే దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తాం. ఈ కేసుపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరగాలని మేం కోరుకుంటున్నాం' అని వెల్లడించారు. ఇదే సమయంలో కేంద్ర దర్యాప్తు సంస్థపై విమర్శలు గుప్పించారు. 'సీబీఐ విజయాల రేటు చాలా తక్కువగా ఉంది. చోరీకి గురైన రవీంద్రనాథ్ ఠాగూర్ నోబెల్ బహుమతి కేసును వాళ్లు ఇంకా పరిష్కరించలేదు' అని మమత దుయ్యబట్టారు. మరోవైపు, కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ దీనిపై మాట్లాడారు. 'ఒకరి కంటే ఎక్కువమంది ఈ నేరానికి పాల్పడటమో లేదా నిందితుడికి సహకరించి ఉంటారని మేం అనుమానిస్తున్నాం. దీనిపై దర్యాప్తు చేపట్టాం. హెల్ప్‌లైన్ నంబర్ కూడా ప్రారంభించా. అనుమానితుల గురించి తెలిసిన వైద్య విద్యార్థులు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు' అని తెలిపారు.

ప్రిన్సిపల్ రాజీనామా

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. మృతురాలి పరువుకు భంగం కలిగించేలా ప్రిన్సిపల్ మాట్లాడినట్లు వార్తలు రావడంతో ఆయన రాజీనామా చేయాలంటూ కాలేజీ వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. దీంతో ఆయన పదవి నుంచి వైదొలిగారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'నన్ను పదవి నుంచి దింపేలా విద్యార్థులను కొంతమంది రెచ్చగొట్టారు. నిందితుడికి శిక్ష పడాలనే నేను కోరుకున్నా. బాధితురాలికి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. కావాలనే నా పరువు తీస్తున్నారు' అని డాక్టర్ సందీప్ ఘోష్ అన్నారు.

క్రీడలపై కేంద్రం నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చేసిన జీఓ 77 కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి పీజీ సెట్ రాసిన విద్యార్థులకు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ వర్తించడం లేదని, దీనివలన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి జీఓ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 107, 108 జీఓల కారణంగా పేద మెరిట్ విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యకు దూరం అవుతున్నారని, తక్షణమే ఈ జీఓలను కూడా రద్దు చేయాలని కోరారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు పౌష్టికాహారం లేక అనేక ఇబ్బందులుపడుతున్నారని, గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు శాశ్వత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నాయకులు మేడా హనుమంతరావు, రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ తమ సందేశం ఇచ్చారు. తొలుత ఇప్టా జాతీయ కార్యదర్శి గని అభ్యుదయ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, వలి, ఏఐఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్, కిరణ్, శివా, నవ్యశ్రీ, డేవిడ్, అమర్నాథ్, కిరణ్, అజయ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

రాజీపడిన సెబీ విశ్వసనీయత

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలతో తీవ్రంగా రాజీపడిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఆమె వాటాలు కొనుగోలు చేసినట్లు వెల్లడైందని, కానీ ఇప్పటికీ ఆమె రాజీనామా చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ఆరోపణలు వెలుగుచూడటంతో ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరిస్తోందా అని రాహుల్ ప్రశ్నించారు. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదికతో లక్షలాది మంది భారతీయుల పొదుపులు ప్రమాదంలో ఉన్నాయని, ఈ అంశంపై విచారణ చేపట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆరోపణలు వాస్తవమైతే వ్యాపారులు కష్టపడి దాచుకున్న సంపద పోగొట్టుకుంటే ప్రధాన మంత్రా లేదా సెబీ చైర్‌పర్సనా లేదా అదానీ ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఈ అంశంలో జేపీసీ విచారణకు ప్రధాని ఎందుకు వెనకడుగు వేస్తున్నారో స్పష్టమౌతోందని అన్నారు. స్టాక్ మార్కెట్‌లో చిన్న, మధ్యతరగతి పెట్టుబడిదారులకు భద్రత కల్పించాలంటే జేపీసీ విచారణ తప్పనిసరి అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. భారత రాజ్యాంగ విలువలను పక్కన పెట్టి తన మిత్రులను కాపాడుకునేందుకు ప్రధాని యత్నిస్తుంటారని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. జేపీసీ విచారణ చేపట్టాల్సిందేనని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు.

సత్తాచాటిన ఏయూ

(మొదటిపేజీ తరువాయి)

ఈ సంవత్సరం ఒక్కసారిగా 35 స్థానాలకు ఎగబాకి 41వ ర్యాంకును సాధించింది. విశ్వవిద్యాలయాల విభాగంలో జాతీయ స్థాయిలో 25వ స్థానాన్ని పొందింది. గత ఏడాది ఈ విభాగంలో ఏయూ 43వ స్థానంలో నిలిచింది.

నీరున్నా...విత్తనం కరువే!

(మొదటిపేజీ తరువాయి)

సాగు ఆలస్యం కావడం...దీనికితోడు నవంబరు, డిసెంబరులో తుపాన్ల వల్ల పంటలకు నష్టం వస్తుందన్న ఆందోళనతో ఎక్కువ మంది రైతులు జేజీఎల్ 384 రకం విత్తనాలనే కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ రకం పంటను రెండేళ్ల నుంచి మన ప్రాంతంలో రైతులు పండించడం లేదు. తెలంగాణ నుంచి విత్తనాలను తెచ్చుకోవడం అనివార్యమైంది. కరీంనగర్, పెద్దపల్లి, మిర్యాలగూడలో అత్యధికంగా రైతులు ఈ రకం వరిని పండిస్తారు. అక్కడి నుంచి జేజీఎల్ 384 రకం విత్తనాలను వ్యాపారస్తులు తెచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం గతేడాది కంటే సాగుకు విత్తనాల డిమాండ్ పెరగడంతో..దానికి అనుగుణంగా ప్రభుత్వం సరఫరా చేయలేకపోయింది. ఈ పరిణామాలతో మార్కెట్‌లో విత్తనాల కొరత ఏర్పడినట్లు రైతులు చెబుతున్నారు. సీఆర్ 1009 రకం విత్తనాలను బాపట్ల జిల్లాలో పండిస్తారు. ఇది కూడా అతి తక్కువ సమయంలో అధిక పంట దిగుబడినిస్తుంది. ఈ రకం విత్తనాలు రూడా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

30 కిలోల సంచికి రూ.600 దోపిడీ

తెలంగాణ నుంచి ఏపీకీ జేజీఎల్ 384 రకం విత్తనాలను ప్రైవేట్ వ్యక్తులు తీసుకొచ్చి మార్కెట్‌లో 30కిలోల సంచి రూ.1800కు విక్రయిస్తున్నారని పల్నాడు, నరసారావుపేట ప్రాంత రైతులు చెబుతున్నారు. వాస్తవంగా 30 కిలోల సంచి ధర రూ.1000 నుంచి రూ.1200 వరకే ఉంటుంది. ఈ రకం విత్తనాలు అందుబాటులో లేనందున అధిక ధరకు రైతులు కొనుగోలు చేసి, ప్రతి సంచికీ రూ.500 నుంచి రూ.600 చొప్పున నష్టపోతున్నారు. పంటలకు సబ్సిడీ కూడా అరకొరగానే మార్కెఫెడ్ శాఖ ఇస్తోంది. వాస్తవంగా రైతులు కొనుగోలు చేసే విత్తనాలపై 40శాతం నుంచి 60 శాతం వరకు సబ్సిడీ ఇవ్వాల్సి ఉన్నా దానిని ఎక్కడా ప్రభుత్వం అమలుచేయడం లేదు. బీపీటీ 5204 రకంతోపాటు చిన్నపాటి రకం విత్తనాలకు కిలోకు ఐదు రూపాయల చొప్పునే రాయితీ కల్పించింది. ఇక రైతులు కావాలంటున్న జేజీఎల్ 384 రకం వరి విత్తనాలను సబ్సిడీ జాబితా నుంచి తొలగించడంతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. ఇటీవల నరసరావుపేట తదితర ప్రాంతాల్లో రైతులు ఆందోళనకు దిగారు. అన్ని రకాల విత్తనాలు రైతులకు అందుబాటులోలేవని, తమకు అవసరమైన జేజీఎల్ 384రకం విత్తనాలను సరఫరా చేయాలని నిరసించారు. ఇదే పరిస్థితి సాగర్ ఆయకట్టు పరిధిలోని జిల్లాల్లో నెలకొంది. రైతులు ఆసక్తి చూపని బీపీటీతోపాటు వివిధ రకాల విత్తనాలనే సరఫరా చేస్తున్నారు. విత్తనాల కొరతపై వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇచ్చిన వివరణపైనా రైతులు సంతృప్తి చెందడం లేదు. తక్షణమే తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి, జేజీఎల్ 384 విత్తనం అందుబాటులో ఉంచేలా చూడాల్సిన అవసరముంది. లేకుంటే సాగర్ ప్రాంతం రైతులు ఈ ఖరీఫ్ సాగుకు తీవ్ర అసౌకర్యానికి గురై..సకాలంలో పంట సాగు చేసే పరిస్థితిని కోల్పోతారు. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం రైతుల కోసం వివిధ రకాల విత్తనాలను 13వేల క్వింటాళ్లు అందుబాటులో ఉంచినట్లు చెబుతున్నారు. అందులో జేజీఎల్ రకం విత్తనాలు లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలి: ఏపీ రైతు సంఘం

రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వం సకాలంలో సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి రైతులు కోరే జేజీఎల్ 384 రకం వరి విత్తనాలను వేగవంతంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల్లోపే జేజీఎల్ 384రకం విత్తనాల సరఫరా ప్రక్రియ పూర్తవ్వాలని డిమాండ్ చేశారు. ఆలస్యంగా విత్తనాలను పంపిణీ చేసినప్పటికీ ఫలితం ఉండబోదని, ఇప్పటికే వరి నారుమళ్లు పోసే ప్రక్రియ సాగర్ అయకట్టు ప్రాంతంలో జరుగుతోందని తెలిపారు. జేజీఎల్ విత్తనాలు అందకపోవడంతో నారు మళ్లు పోసే ప్రక్రియ మరింత ఆలస్యమవుతుందని పేర్కొన్నారు. జేజీఎల్ 384 రకం విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు.

కేజీ బేసిన్ చమురు, గ్యాస్ ఆంధ్రుల సొత్తు

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణా, గోదావరి(కేజీ) బేసిన్‌లోని సహజవాయువు, చమురు ఆంధ్ర ప్రజల సొత్తని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కృష్ణా గోదావరి బేసిన్ గ్యాస్, చమురు సాధన సమితి అధ్వర్యాన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ... విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని... అదేవిధంగా గ్యాస్ బేసిన్ లో 50% వాటా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు దక్కాన్నారు. దీనికి ప్రజాఉద్యమం తప్పనిసరని పేర్కొన్నారు. విద్యార్థి, యువతతో పాటు యావత్ ప్రజానీకాన్ని ఆందోళనకు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్ కొల్లా రాజ్ మోహన్ మాట్లాడుతూ కేజీ బేసిన్‌లో జనవరి ఏడో తేదీన ముడి చమురు ఉత్పత్తిని ప్రారంభించారని తెలిపారు. గతంలో ఇక్కడ కేవలం గ్యాస్ ఉత్పత్తి మాత్రమే జరిగేదన్నారు. 50% గ్యాస్, చమురు ఉత్పత్తి ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు చెందాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, ప్రముఖ రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ చమురు, గ్యాస్ కోసం రాష్ట్రవ్యాప్తంగా కేజీ బేసిన్ సాధన సమితి అధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్యాస్ సాధనకై సమైక్య ఉద్యమం నిర్మించడానికి ముందుంటామన్నారు. కేజీ బేసిన్‌లో ఉత్పత్తయిన గ్యాస్‌ను రాష్ట్ర ప్రజలకు గృహ అవసరాలకు రూ.100లకు, పెట్రోల్ లీటర్‌రూ.10కే అందించాలని, కేంద్ర ప్రభుత్వానికి రాయల్టీగా వచ్చే లాభంలో కనీసం 50శాతం రాష్ట్ర ప్రజలకు కేటాయించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సభలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, మరో ఎంసీపీఐ(యూ) నాయకులు ఎం వెంకటరెడ్డి, సీపీఐ (ఎంఎల్) నాయకులు ముప్పాళ్ల భార్గవశ్రీ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు పీవీ రమణారెడ్డి, డి.హరనాథ్, సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ నాయకులు మన్నవ హరిప్రసాద్, షేక్ మహమ్మద్ భాష, ఓపీడీఆర్ జాతీయ అధ్యక్షులు సి భాస్కరరావు, రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, ప్రొఫెషనల్ ఫోరం ఉద్యమ నాయకులు నేతి ఉమామహేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.జమలయ్య, ప్రముఖ రైతు నాయకులు వీ కృష్ణయ్య, వై కేశవరావు, ఏఐటీఎఫ్ నాయకులు శ్రీధర్, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు యు.వీరబాబు, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కొరివి వినయ్ కుమార్, ప్రముఖ పాత్రికేయులు డి. పాపారావు, విశ్రాంత ఐఐటీ ప్రొఫెసర్ కారుమంచి విజయకుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ డెమొక్రటిక్ అధ్యక్షులు అవధానుల హరి, లోక్ సత్తా పార్టీ నాయకులు మాదాసు భాను ప్రసాద్, మనోరమ, ప్రముఖ రైతు నాయకులు జొన్నలగడ్డ రామారావు, మేకల ప్రసాద్, ఎంఎల్ సీఐ(రెడ్ ఫ్లాగ్) రాష్ట్ర నాయకులు మరీదు ప్రసాద్ బాబు, ప్రముఖ సామాజిక విశ్లేషకులు టి లక్ష్మీనారాయణ, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో కృష్ణమ్మ హారతి పున: ప్రారంభం

దేవదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : గోదావరి-కృష్ణా సంగమ ప్రాంతమైన పవిత్ర సంగమం (ఇబ్రహీంపట్నం) ఫెర్రీ వద్ద నెల రోజుల్లోగా కృష్ణమ్మ జల హారతి కార్యక్రమాన్ని పున: ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో కృష్ణమ్మ హారతి కార్యక్రమం పున: ప్రారంభానికి సంబంధించి ఏర్పాటయిన మంత్రుల బృందం (జీవోఎం) సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్వర్యంలో పవిత్ర సంగమం వద్ద కృష్ణమ్మ హారతిని ఒక పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమంగా నిత్యం నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. అయితే గత ఐదేళ్ల కాలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. మరలా కృష్ణమ్మ హారతిని నెల రోజుల్లోగా పున: ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇందుకోసం ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద రహదార్లు, విద్యుత్, బస్సు రవాణా, పారిశుధ్య నిర్వహణ వంటి సదుపాయాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు సంబంధిత శాఖల అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం, జలవనరులు, సీఆర్‌డీఏ, దేవదాయ శాఖ, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, పోలీసు, ట్రాన్స్‌కో, మునిసిపల్ తదితర శాఖల అధికారులు వారి స్థాయిలో సమన్వయ సమావేశం నిర్వహించుకుని తగు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రానున్న రోజుల్లో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. రాజమహేంద్రవరంలో గోదావరి హారతి ప్రస్తుతం కొనసాగుతోందని, దానిని మరింత పటిష్టవంతంగా నిర్వహించేందుకు కూడా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ సృజన, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవో రామారావు, అగ్నిమాపక సేవల డైరెక్టర్ మురళి, విజయవాడ పశ్చిమ డీసీపీ టి.హరికృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూములు దోచిపెట్టిన సూత్రధారి

అప్పటి కలెక్టర్ గిరీష్‌పై చర్యలేవి?: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-రాయచోటి: పెద్ద మనుషుల అనే ముసుగులో రాబందుల వలె పేదల భూములను దోచుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య విమర్శించారు. సోమవారం ఉదయం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రెవెన్యూ భూ బాధితులతో జరిగిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల భూముల కబ్జాలకు పాల్పడ్డారని, మదనపల్లె కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధమై 25 రోజులు కావస్తున్నా అసలు దోషులను వదిలేసి, చిన్నపాటి ఉద్యోగులను పట్టుకున్నారని తెలిపారు. మదనపల్లె ఘటనలో కేవలం ఒక్క రోజులోనే సుమారు 520 మంది బాధితులు తమ భూములు కబ్జాకు గురయ్యాయని, భూ రికార్డులను, ఎవరు ఆక్రమించారో వారి పేర్లతో సహా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినా నేటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదని ఈశ్వరయ్య ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, అణగారిన వర్గాలకు చెందవల సిన అసైన్డ్ భూములన్నింటినీ రాజకీయాల అండదండలు ఉన్న వారికి దోచిపెట్టారని మండిపడ్డారు. గతంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పని చేసిన గిరీష అసలైన సూత్రధారి అని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సంబంధించిన 13 ఎకరాలు కబ్జా చేసి రిజిస్టర్ చేయించుకున్నారని, అది చేయించింది కూడా అప్పటి కలెక్టర్ గిరీష కాదా, ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ఈశ్వరయ్య ప్రశ్నించారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లోని రెవెన్యూ భూ బాధితుల, రాజకీయ రాబందుల భూ బాధితుల అఖిలపక్ష సదస్సును ఈనెల 20న విజయవాడలో నిర్వహించి, భూ బాధితుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి రాయబారిగా సీపీఐ ఉంటుందన్నారు. రానున్న కాలంలో రెవెన్యూ, రాజకీయ భూ బాధితుల పక్షాన నిలబడి పోరాటాలు చేసి ఎవరికి చెందవలసిన భూములు వారికి దక్కే విధంగా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుధీర్ కుమార్, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోండి

డీసీసీబీ వద్ద సీపీఐ సారథ్యంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ధర్నా

విశాలాంధ్ర-ఏలూరు: అకారణంగా తొలగించిన డీసీసీబీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వద్ద తమను విధుల్లోకి తీసుకోవాలంటూ సీపీఐ అధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 34 శాఖల్లోని 55 మంది ఔట్‌సోర్సింగ్ అటెండర్లను సమాచారం ఇవ్వకుండా అకార ణంగా విధుల నుంచి తొలగించడం దారుణమని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కాంట్రాక్ట్ ఉద్యోగులు మెడపై వేటు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతంతో కుటుంబాలను పోషించుకోవడానికి ఉద్యోగాలు చేస్తున్న సామాన్యులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ అటెండర్‌లను తొలగించలేదని చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో కోట్ల రూపాయల అవినీతి జరిగితే చర్యలు తీసుకొని ప్రభుత్వం... పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా చిరు ఉద్యోగులను తొలగించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 11 నిబంధనలకు అనుగుణంగా జీతాలు చెల్లించాలన్నారు. పోరాటానికి సీపీఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏఐటీయూసీ ఏలూరు అధ్యక్షుడు కొంపల్లి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ అటెండర్‌లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, కార్యవర్గ సభ్యుడు మావూరి విజయ, ఎం.ఏ హకీమ్, కొల్లూరి సుధారాణి, జిల్లా సమితి సభ్యులు భజంత్రీ శ్రీనివాసరావు, నాగం అచ్యుత్, యాగంటి కుమార్, సూరిబాబు,శివ, హేమలత, మాలతీ, జి.నళిని, కే లక్ష్మి మంగతాయారు, పి.శిరీష, బి.అంజి బాబు పాల్గొన్నారు.

అటవీ బంజర భూములకు పట్టాలివ్వండి: చలసాని

విశాలాంధ్ర-ముసునూరు: అటవీ బంజర భూముల్లో 50 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న పేద, బలహీన వర్గాలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో సోమవారం అటవీ బంజర భూముల సాగుదారుల సమావేశం జరిగింది. చలసాని మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఉన్న అటవీ బంజర భూమిని దశాబ్దాలుగా పేదలు సాగు చేస్తున్నారని చెప్పారు. గతంలో కమ్యూనిస్టు నాయకులు పేదల పక్షాన నిలబడి భూ పోరాటాల ఫలితంగా పేదలకు భూమి పంపిణీ చేశారని వివరించారు. మూడు తరాలుగా సాగులోనే ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి పట్టాలు ఇవ్వాలన్నారు. సీపీఐ నేత చాట్ల పుల్లారావు, అబ్బురి రంగారావు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు కార్యాచరణ ప్రణాళిక: కొండపల్లి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదికలో ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏ తరహా ఉపాధి కల్పించవచ్చనే అంశంపై అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని... ప్రజల సమస్యలకు జిల్లాస్థాయిలోనే పరిష్కారం చూపేందుకు ఇది మంచి వేదిక అవుతుందన్నారు. భూసమస్యలపై అధికంగా వినతులు అందాయని మంత్రి చెప్పారు. ఆసుపత్రులకు సంబంధించిన సమస్యలు, ఇతర చిన్న సమస్యలపై అక్కడికక్కడే పరిష్కారానికి అధికారులను ఆదేశించామన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ బీఆర్ అంబేద్కర్, అధికారులు పాల్గొన్నారు.

48 గంటల్లో రైతులకు ధాన్యం సొమ్ము: నాదెండ్ల

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని రాష్ట్ర పౌర సరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సోమవారం రైతులకు ధాన్యం బకాయిల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మంత్రి మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం రైతులను సంక్షోభంలోకి నెట్టిందన్నారు. పౌర సరఫరాల సంస్థ పేరు మీద రూ.40,500 కోట్లు బ్యాంకు నుంచి అప్పుతీసుకుందని అన్నారు. 2025 మార్చి 30 నాటికి బ్యాంక్ లకు రూ.10 వేల కోట్లు అప్పు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో కొనుగోలు చేసిన ధాన్యం సొమ్మును 48 గంటలలో రైతులకు చెల్లించే విధంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. 84,724 మంది రైతులకు 1674.47 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. తొలి విడతగా 35,374 మంది రైతులకు 674.43 కోట్లు బకాయిలు చెల్లిస్తున్నామన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో టార్పాలిన్లు అందజేస్తామని, మిల్లర్లకు, దళారులకు, వ్యాపారవేత్తలకు భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఉచిత పంటల బీమా అమలు చేసే యోచనలో కూటమి ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి జరిగే గ్రామసభల్లో కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడారు. ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్ కుమార్, చిర్రీ బాలరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డీఎస్ఓ సత్యనారాయణ రాజు, సివిల్ సప్లై డీఎం మంజు భార్గవి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పౌర సరఫరా అధికారులు పాల్గొన్నారు.

తుంగభద్ర గేటుకు మరమ్మతులు చేయాలి : సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తుంగభద్ర గేటుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, తుంగభద్ర ప్రాజెక్టు 19వ నంబరు గేటు కొట్టుకుపోవటంతో ప్రాజెక్టులో ఉన్న నీరు వృధాగా దిగువకు వెళ్లిపోయి, ఆయకట్టుకు నీరు అందకుండా పంటలు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పంటలకు నీటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్వహణలో నిర్లక్ష్యం మూలంగా గతంలో పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయాయని, తక్షణమే కొట్టుకుపోయిన గేటుకు అవసరమైన మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. డ్యామ్‌లో నీళ్లు పూర్తిగా ఖాళీ కాకముందే ప్రత్యామ్నాయ చర్యలతో నీరు దిగువకు వృధాగా పోకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

శాప్‌లో అక్రమాలపై విచారణ

మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శాప్ (ఆంధ్ర ప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ) లో జరిగిన అక్రమాలపై విచారణ చేపడతామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. జగన్ ప్రభుత్వంలో రూ.120 కోట్లను 'ఆడుదాం ఆంధ్ర' కోసమని 40 రోజుల్లోనే ఖర్చు పెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వీటిపై ఆధారాలను సేకరిస్తున్నామని, విచారణ చేపడతామని తెలిపారు. గత ప్రభుత్వంలో శాప్‌లో జరిగిన సర్టిఫికెట్ల కుంభకోణంపై అధికారులతో చర్చించామని చెప్పారు. సీఎం చంద్రబాబుతో చర్చించి కమిటీ వేసి దొంగ సర్టిఫికెట్ల వ్యవహారాన్ని తేల్చుతామని అన్నారు. రాష్ట్రాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. శాప్ అధికారులతో సోమవారం ఏపీ సచివాలయంలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించి అనేక కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ క్రీడావికాస కేంద్రాలు, గ్రామ స్థాయిలో క్రీడల నిర్వహణ, ప్రోత్సాహంపై సీఎంతో చర్చిస్తామని అన్నారు. అమరావతి పేరుతో వచ్చే అయిదేళ్లలో ఐపీఎల్ క్రికెట్ జట్టును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గల్లీ నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకూ క్రీడల ప్రోత్సాహకానికి కృషి చేస్తామని అన్నారు. క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించి వారిలో క్రీడాశక్తి పెంపొందించి ఉత్తమ క్రీడాకారులుగా రాణించేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్టేడియంల నిర్మాణానికి పెద్ద పీట వేస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో అనుమతి లేని క్రీడా అకాడమీల అనుమతులు రద్దు చేస్తామని వెల్లడించారు.

అమరావతి నిర్మాణానికి మంత్రి విరాళం అందజేత

రాజధాని అమరావతి నిర్మాణానికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి విరాళం అందజేశారు. తన వంతుగా రూ.3,01,116 చెక్కును సీఎం చంద్రబాబుకు ఆయన సచివాలయంలో అందజేశారు.

తోట, అనంతబాబును బహిష్కరించండి: డొక్కా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తన పేరు తీసేశారని జగన్ హడావుడి చేయడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి, టీడీపీ నేత డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. అమరావతిలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ దళితులపై దాడి చేసిన వారిని, హత్య చేసిన వారిని పార్టీలో పెట్టుకుని జగన్ మాట్లాడటం విడ్డూరమని అన్నారు. అంబేద్కర్‌పై నిజంగా జగన్‌కు గౌరవం ఉంటే శిరోముండనం కేసులో ఉన్న తోట త్రిమూర్తులు, దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబును వైసీపీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

విక్రమ్ సారాభాయ్‌కి పవన్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ జీవితం స్ఫూర్తిదాయకమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విక్రమ్ సారాభాయ్ జయంతి సందర్భంగా సోమవారం ఆయనకు నివాళు లర్పించారు. శాస్త్రవేత్తల ఆలోచనలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. అంతరిక్షంలో గణనీయమైన విజయాలకు విక్రమ్ సారాభాయ్ కృషి కారణమని అన్నారు. ఆయన స్ఫూర్తితో మరిన్ని పరిశోధనలు ఆవిష్కృతం కావాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

పేదలపై కూటమి ప్రభుత్వం కక్ష : జూపూడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/హైదరాబాద్: పేదలపై టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగిందని వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు ధ్వజమెత్తారు. హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అసైన్ చేసి 20 ఏళ్లు పూర్తయిన అసైన్డ్ భూములపై అసైనీలకు పూర్తి హక్కులు కల్పిస్తూ గత ప్రభుత్వం నిర్ణయిస్తే... ఇప్పుడు ఆ అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు ఆపాలంటూ ఆదేశాలివ్వడం అత్యంత దుర్మార్గమని అన్నారు.

దీర్ఘకాలంగా భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పూర్తి హక్కులు కల్పించాలని నాడు సీఎం వైఎస్ జగన్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని జూపూడి గుర్తుచేశారు. ఒరిజినల్ అసైనీ ఎవరో వారి పేరుపై మాత్రమే రిజిస్టర్ చేసి వారికి మాత్రమే అమ్ముకునే అవకాశం ఇచ్చారని ఆయన తెలిపారు. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వ నిర్ణయం వల్ల లక్షలాది రైతుల పరిస్థితి గందరగోళంగా మారిందన్నారు. ఆ అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకోవడానికి అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలను అమలు చేయలేక, ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. పేదలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలపై తమ పార్టీ పోరాడుతుందని జూపూడి స్పష్టం చేశారు.

ఆకాశమే హద్దుగా విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

విశాలాంధ్ర-మంగళగిరి: ఆకాశమే హద్దుగా ఇంజినీరింగ్ విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలని భారత రాయబారి, లడక్ ఏరియాలో ప్రధాన మంత్రి ప్రత్యేక సలహాదారు దీపక్ వోహ్రా పిలుపునిచ్చారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో సోమవారం ఈ ఏడాది ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన నూతన విద్యార్థులకు 'ఉడాన్' పేరిట ఓరియెంటేషన్ ప్రోగ్రాం జరిగింది. ముఖ్య అతిథిగా దీపక్ వోహ్రా హాజరయ్యారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా నేతృత్వంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం జరిగింది. అనంతరం నూతన విద్యార్థులను ఉద్దేశించి దీపక్ వోహ్రా ఉత్సాహపూరిత ప్రసంగం చేశారు. భారత ఉజ్వల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలని సూచించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మనోజ్‌కుమార్ అరోరా వర్సిటీ డీన్‌లు, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, వివిధ విభాగాల అధిపతులను పరిచయం చేశారు. యూనివర్సిటీలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలు, లేబొరేటరీలు, పరిశోధనల గురించి వివరించారు. స్టూడెంట్స్ అఫైర్స్ అసోసియేట్ డైరెక్టర్ రేవతీ బాలక్రిష్ణన్ తన ప్రసంగంలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రో ఛాన్సలర్ డాక్టర్ సత్యనారాయణన్ తరఫున నూతన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, వీసీ మనోజ్ కుమార్, అకడమిక్స్ డీన్ డాక్టర్ వినాయక్ ముఖ్య అతిథి దీపక్ వోహ్రాకు జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు సీవీ టామి, డాక్టర్ భరద్వాజ్, డైరెక్టర్లు అనిల్ నిగమ్, అనూప్ సింగ్, పంకజ్ బల్వేరియా, సీఎఫ్ఏవో సుమ, అడ్మిషన్స్ డైరెక్టర్ యల్లంపల్లి శివశంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఉక్కపోత వాతావరణం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఓ పక్క వర్షాలు కురుస్తున్నా ప్రజలను ఉక్కపోత వదలడం లేదు. బయట ఉష్ణోగ్రతలు లేకపోయినా ఉదయం నుంచే ఇళ్లల్లో ఉక్కపోతతో చిన్నాపెద్దా అల్లాడి పోతున్నారు. ఇలాంటి వాతావరణం ఎప్పుడూ చూడలేదని ప్రజలు అంటున్నారు. ఆగస్టులో సాధారణంగా చలి వాతావరణం ఉంటుంది. వర్షాల కారణంగా కొంత చల్లబడినట్లు కనిపిస్తుంది. వాతావరణం చల్లగా ఉందనుకుంటే చెమటలు కారిపోతున్నాయి. విభిన్న వాతావరణం కనబడుతోంది. రాత్రి వేళ ఏసీల వాడకం తగ్గడం లేదు. పగలు రాత్రి ఉక్కపోత కారణంగా ఫ్యాన్లు, ఏసీల వినియోగం పెరిగిపోవడంతో విద్యుత్తు బిల్లులు కూడా తడిసి మోపెడవుతున్నాయి. మరో వైపు అక్కడక్కడా విషజ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సంపాదకీయం

సెబి అధిపతిని బోనెక్కించాల్సిందే

హిండెన్ బర్గ్ సంస్థ రెండో బాంబు పేల్చింది. దీని మీద సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఖండన వచ్చింది. అదానీ ఖండనా వచ్చింది. సెబీ అధ్యక్షురాలు మాధవి బుచ్ ఆమె భర్త ధవళ్ బుచ్ హిండెన్‌బర్గ్ ఆరోపణలను తిరస్కరించడమూ జరిగిపోయింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జై రాం రమేశ్ హిండెన్ బర్గ్ తాజాగా వెల్లడించిన అంశాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జె.పి.సి.) తో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుడు రవి శంకర్ ప్రసాద్ వెంటనే కుదరదనేశారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రి సీతారామన్ ఎప్పటిలాగే పెదవి విప్పనే లేదు. కానీ రవి శంకర్ ప్రసాద్ జె.పి.సి దర్యాప్తును నిరాకరిస్తారు. మోదీ ప్రభుత్వం నడుస్తున్న తీరునుబట్టి రవి శంకర్ ప్రసాద్ మాటే అంతిమం అనుకోవాల్సి వస్తుంది. హిండెన్‌బర్గ్ కూడా తన అభిప్రాయం మరోసారి వెల్లడించింది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా మాధవి బుచ్, ధవళ్ బుచ్ ఖండనను ఈకకు ఈక తోకకు తోక తీసి అసలు రహస్యం బయట పెట్టడానికి ప్రయత్నం చేశారు. "మీరు బినామీ నిధుల్లో పెట్టుబడి పెట్టే అనుభవం ఉన్న వారు కదా అదానీ గురించి ఏ తప్పిదమూ కనిపించలేదా" అని మహువా మొయిత్రా ఎద్దేవా చేశారు. మొట్టమొదటి హిండెన్ బర్గ్ నివేదిక 2023 జనవరిలో వచ్చింది. రెండో నివేదిక రెండు రోజుల కింద వచ్చింది. మొదటి నివేదిక వచ్చిన నెలా పదిహేను రోజుల తరవాత మాధవీ బుచ్ ఒక విదేశీ పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ నేను చాలా రోజులు ప్రైవేటు రంగంలో పని చేశాను. ఈ రంగాన్ని నియంత్రించే సెబీలో పని చేయడం ఇంకా బాగుంటుంది కదా అనుకున్నాను" అని చెప్పారు. సెబీ అధిపతిగా ఆమె అదానీ లొసుగులను బయటపెట్టలేదు. కానీ తానే 2015లో విదేశాల్లోని అదానీ డొల్ల కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు. వాటిలో ఆమె భర్తకు కూడా పెట్టుబడులు ఉన్నాయి. ఈ విషయం సెబీ అధిపతిగా ఆమెను నియమించిన వారికి తెలియదనుకోవడం అమాయకత్వం అవుతుంది. నిజానికి అదానీ సిఫార్సు మీదే ఆమెను సెబీ అధిపతిని చేశారు. ఆమె హయాంలో అదానీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరగడానికి అడుగడుగునా అడ్డుపడ్డారు. హిండెన్ బర్గ్ రెండో నివేదిక ఈ అంశాన్ని బలపరుస్తోంది. హిండెన్ బర్గ్ ఇచ్చిన వివరణ తన నివేదికలోని ఆరోపణలను పునరుద్ఘాటించింది. అదానీ, మోదీకి మధ్య బంధం గురించి చాలా రోజులుగా వినిపిస్తూనే ఉంది. రెండో నివేదిక వెలువడ్డ తరవాత మోదీ-అదానీ మధ్య బంధం ఎంత గహనమైందో అర్థమై పోయింది. తాను, తన భర్త సింగపూర్ లో ఉన్నప్పుడు విదేశాల్లోని అదానీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టామని అంగీకరించారు. అదానీ కంపెనీలు ఎంత మహత్తరమైనవో ఆమె అనేక సార్లు కితాబు ఇచ్చారు. ఏ ప్రైవేట్ కంపెనీల నడవడిక మీద నిఘా వేసి ఉంచాలో వాటినే ఆమె నోరారా పొగడుతున్నారు అంటే ఆమె ఆంతర్యం ఏమిటో, తన అధికార పీఠం నుంచి ఆ డొల్ల కంపెనీల మీద ప్రశంసల జల్లు కురిపించి పనిలో పనిగా సొంత లాభం బాగానే చూసుకున్నారు అనడానికి సంశయించవలసిన అగత్యమే లేదు. మాధవీ బుచ్ సెబీ అధిపతిగా ఉన్నప్పుడు అదానీకి చెందిన అనుమానాస్పదమైన కంపెనీలపై దర్యాప్తే జరగలేదు. కాదు ఆమె జరగనివ్వలేదు. సెబీ అపఖ్యాతి పాలు కావడం ఇదే కొత్త కాదు. 15 ఏళ్ల నుంచే సెబీ మీద ఉన్న విశ్వసనీయత క్రమంగా తగ్గుతూ వచ్చింది. మాధవి బుచ్ పుణ్యమా అని సెబీ మీద జనానికి ఉన్న నమ్మకం దూది పింజంలా ఎగిరిపోయింది. ఇది విశ్వాస ఘాతుకం. బుచ్ ఉదంతంవల్ల అదానీ మీదే కాక మోదీ మీద కూడా నీలి నీడలు దట్టంగా కమ్ముకోక తప్పదు. విశ్వాస ఘాతుకానికి పాల్పడింది కేవలం మాధవి బుచ్ మాత్రమే కాదు. మోదీ పాత్రా అందులో నిరాకరించడానికి వీలు లేదు. హిండెన్ బర్గ్ రెండో సారి వెల్లడించిన అంశాలపై తాము జోక్యం చేసుకోబోమని ప్రభుత్వం బాహాటంగా చెప్తోందంటే మోదీ పీకలోతుల్లో దాకా ఈ కుంభకోణంలో కూరుకు పోయినందువల్లే.

తన భర్త ధవళ్ బుచ్‌కు ఉపాధి కల్పించిన కంపెనీలను ప్రశంసించి ఆ కంపెనీల అక్రమాలు బయట పడకుండా ఉండడమే కాక సొంత లాభాలు నొల్లుకోవడానికి మాధవి చేయగలిగిందల్లా చేశారు. 2023లో మొదటిసారి హిండెన్ బర్గ్ అదానీ గుట్టు విప్పిన తరవాత అనేక తరహాల దర్యాప్తులు జరిగాయి. కానీ నియంత్రాణాధికారం ఉన్న సెబీ చేసింది శూన్యం. చివరకు సుప్రీంకోర్టు నియమించిన కమిటీ దర్యాప్తులో కూడా వడ్ల గింజలోనిదే బియ్యపు గింజ అని తేల్చారు తప్ప అదానీని బోనెక్కించనే లేదు. మాధవి బుచ్ అధీనంలోని అగోరా కంపెనీ ద్వారా తనకు ఎంత ఆదాయం వస్తోందో కూడా మాధవి వెల్లడించలేదని కూడా హిండెన్ బర్గ్ నివేదికలో పేర్కొన్నారు. విదేశాల్లో గౌరవనీయమైన, ప్రధానమైన భారత మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ఉన్నా మాధవి బుచ్ మాత్రం అనుమానాస్పదమైన తనకు లాభం చేకూరుస్తాయి అనుకున్న కంపెనీల్లోనే పెట్టుబడులు పెట్టారు. మాధవి బుచ్ మీద ఇంతటి తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తుంటే అది విదేశీ కంపెనీ అనీ, మన దేశాన్ని అపఖ్యాతి పాలు చేయడానికే ఇలాంటి పనులు చేస్తోంది అని ఎదురు దాడి చేస్తోంది బీజేపీ. అది విదేశీ కంపెనీ అయినంత మాత్రాన ఆరోపణలు తీవ్రమైనవి అయినప్పుడు దర్యాప్తునకు ఆదేశించడానికి మోదీ సర్కారు భయపడడమే అదేదో జరగ కూడనిది జరిగిందని అనుకోవాలి. పైగా ప్రతిపక్ష "ఇండియా" ఐక్య సంఘటన బలవంతంగా డబ్బులు వసూలు చేస్తోందని మోదీ నిరాధారమైన ప్రచారం చేస్తూ తన అసత్య ప్రచారాన్ని మరింత జోరుగా కొనసాగిస్తున్నారు. అదానీ కుంభకోణా ల్లాంటివి ఎదురైనప్పుడు సెబీ నిజం నిగ్గు తేలుస్తుందనుకోవడమే భ్రమ. ఈ దురాగతాలను అరికట్టడానికి భిన్నమైన మార్గాలను అనుసరించ వలసిందే. జె.పి.సి. దర్యాప్తుకు అక్షేపణ అక్కర్లేదు కానీ బాధ్యతా యుతమైన పౌరులు, ఆర్థిక అంశాల మీద పట్టున్న ప్రముఖులు, పత్రికా రచయితలు నేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంవల్లే ఎక్కువ ఫలితం ఉండొచ్చు. దానికి తోడు కుంభకోణాలు మన ఆర్థిక వ్యవస్థను ఎలా కుళ్లబొడుస్తున్నాయో, అదానీ లాంటి వారు రోజుకు వందల కోట్ల రూపాయల లాభం ఎలా గడిస్తున్నారో, వ్యాపార సంస్థలను నియంత్రించవలసిన సెబీ లాంటివి ఎంత నిర్వీర్యం అయిపోయాయో జనానికి తెలియ చేయడానికి సదస్సులు, గోష్ఠులు నిర్వహించాలి. జన సంక్షేమాన్ని కాంక్షించే వారు ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. క్షేత్ర స్థాయిలో ఇలాంటి ప్రచారం చేస్తే తప్ప మోదీ లాంటి అదానీకి నమ్మిన బంట్ల ఆట కట్టించడం కుదరదు.

జీవించే హక్కు

చింతపట్ల సుదర్శన్

అదో వీధికుక్క. బక్కచిక్కి పోయి ఉంది. డొక్క ఎగరేస్తూ నిలబడింది. పాపం ఎన్నాళ్లయిందో తిండి తిని అనుకుంది దూరంగా చెట్టుకింద నిలబడున్న డాగీ. ఆ దారంట ఓ బైకు రయ్యిమంటూ దూసుకు వచ్చింది. మూలుగుతూ ఓ పక్క నిలబడ్డ వీధికుక్క లేచి నిలబడింది. ఒంట్లో శక్తినంతా కాళ్లల్లోకి తెచ్చుకుని ఆ బైకు వెంట అరుస్తూ పరుగెత్తింది. బైకువాడు స్పీడు పెంచి తప్పించుకుపోయాడు. అరుస్తూ వెనక్కు వచ్చిన వీధికుక్క అటుగా వస్తున్న మరో బైకు వెంట అరుస్తూ పరుగెత్తింది.

ఏమైంది దీనికి వచ్చిన ప్రతి బైకు వెనకా పరుగెత్తుతున్నది అనుకుంటూ ఆ సంగతే అడిగింది. ఏమైంది ఎక్కడా తిండి దొరక్కపోతే వచ్చీపోయే మనుషుల పిక్కలు కొరికి తిందామనుకుంటున్నావా? అదేంలేదు భాయి సాబ్. నిన్న ఓ బైకు నాకొడుకు నా చిన్నారి కూన మీదినించి దూసుకుపోయేడు. అప్పట్నించి ఏ బైకును చూసినా నా చిట్టితల్లే గుర్తుకు వస్తున్నది. అందుకే బైకు కనబడితే చాలు పూనకం

రంగస్థలం

వస్తున్నది. ఇక తిండి అంటావా అడక్కు. ఈ లోకంలో మనుషులకు తప్ప తిండి తినే హక్కు ఎవరికీ లేదేమోననిపిస్తున్నది అంది వీధి కుక్క

ఆ మాట నిజమేననుకో. ఈ భూ ప్రపపంచకమంతా తమ తాతగారి జాగీరనుకుంటున్నారు. ఇన్నాళ్లూ ఎంతో విశ్వాసంగా ఉన్నామన్న విశ్వాసం కొంచెం కూడా లేదు వాళ్లకి. ఎవరి బైకో నీ బిడ్డను చంపితే, మిగతా వారిని కరవాలనుకోవడం, బైక్‌ల వెంట పరుగెత్తడం ఏ మాత్రం సబబైన విషయం కాదు, ఆలోచించు. నేరం ఒకరిదయితే శిక్ష మరొకళ్లకు వెయ్యద్దు. రా...నా వెంబడి, ఈ దారంట పోతే ఓ హోటల్ వెనక చెత్తకుండీ ఉంటుంది. అక్కడ నాకూ నీకూ ఏదైనా తిండానికి దొరకవచ్చు అంటూ డాగీ ఆ వీధి కుక్కను ఓదారుస్తూ తన వెంట నడిపించింది.

అరుగు ఎక్కుతున్న రెండు కుక్కల్ని చూసింది డాగీ. ఈ 'అతిథి ఎవరోయ్' అంది డాగీతో. కొత్త ఫ్రెండులే తన బిడ్డని ఓ బైకు తొక్కే సిందన్న బాధలో ఉంటే ఊరడించి కాస్సేపు మరిచిపోతుందని తీసుకు వచ్చా. మనుషుల వెంట తోక ఊపుతూ తిరిగామిన్నాళ్లూ. కానీ రోడ్ల మీద కుక్కచావు చచ్చినకుక్కల్ని ఎవడైనా పట్టించుకున్నాడా? చట్టసభల్లో కుక్కల్లా కాట్లాడుకుంటారు కాని వందల ఏళ్లనించి మనిషికి ఊడిగం చేస్తున్న మనల్ని ఇప్పుడులేకుండా చేస్తామంటున్నారు అంది డాగీ.

చెరువులు తాగేస్తున్నారు. చెట్లు మింగేస్తున్నారు, కొండల్ని నమిలేస్తున్నారు. ఈ భూమ్మీద వాళ్లు తప్ప మరొకరు లేకుండా చేస్తున్నారు అంది డాంకీ. 'జీవించు, జీవించనీయ' అన్న మాట వాళ్లకు వర్తించదు. ఎంతసేపూ తామే జీవించాలనుకుంటారు అంటూ మొండిగోడ మీదికి వచ్చి నిలబడింది పిల్లి. దాన్ని చూడగానే రెండు కుక్కలూ యుగళగీతం అందుకోబోయినయి. ఇంతకు ముందే చెప్పా, పిల్లికీ కుక్కకూ శతృత్వం వట్టి కల్పితమని కుక్కా పిల్లీ, గాడిదా ఇలా అన్నింటికీ జీవించే అవకాశం లేకుండా చేస్తున్నారు మనుషులు. ఆ సంగతి ఆలోచించండి అంది డాంకీ.

అవును డాంకీ! నన్ను చూడు ఒకప్పుడు లావుగా బొద్దుగా, ముద్దుగా ఉండేదాన్ని. ఇప్పుడు ఎముకాతోలూ మిగిలాయి. ఏ ఇంట్లోనూ తిండి దొరకడంలేదు. పాలూ, పెరుగూ, నిన్న వండిందీ, మొన్న వండింది అన్నీ ఫ్రిజ్జుల్లో పెట్టి దాచుకుంటున్నారు. ఉట్టీలేదు, చట్టీలేదు. వెజ్జూ, డెయిరీ కరవైతే అయింది నాన్‌వెజ్జుందిగా అనుకుంటే, ఎలుకలెక్కడా కనిపించవు. అనేక అంతస్తుల ఇళ్లల్లోకి, ఎలుకలు ఎక్కడానికి ప్రత్యేక లిఫ్టులు లేవు కదా. ఇక మామూలు ఇళ్లల్లో ఇది వరకులాగ అటకలు లేవు. సామానంతా కప్‌బోర్డుల్లోనేనాయె. ఎలుక అనే జీవాన్ని చూసి ఎన్నాళ్లయిందో అంది పిల్లి. పిల్లులూ, బల్లులూ, ఎలుకలేకాదు ఆఖరుకు పిచ్చుకలక్కూడా జాగాలేదు, తిండీనీరూ లేదు. అంతా కట్ట కట్టుకు చావ్వలసిందే. కనుమరుగవ్వాల్సిందే అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి.

నువ్వు చెప్పు బ్రో మేమంతా ఉండాలా? చావాలా? వీధి కుక్కలు లక్షలైనవని, జనాన్ని కరుస్తున్నవని అన్నింటినీ చంపేయాలనీ అంటున్నారు మనుషులు. ఇంకా మా జాతి అంతరించినట్టేనా? చెత్తకుండీల్లో పసిపాపల్ని పారేసి పోయే మనుషులు కుక్కల్ని క్రూరమైనవనీ, సింహాల్లా కరుస్తున్నాయని అంటున్నారు. ఇలాగే అందరినీ నరికేసుకుంటూపోతే, పులులూ, సింహాలూ కూడా ఊళ్లల్లోకి రావంటావా? తిండి కోసం, నీడకోసం, ఆఖరుకు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడిపోయే కుక్కలు కొన్ని మతితప్పి దిక్కుతోచక కరుస్తున్న మాట నిజమే, కాని ఎన్నెన్నో మందులూ మాకులూ కనిపెట్టారే మనుషులు మా బాధలకు ఉపశమనం కనిపెట్టలేరా అంది డాగీ.

మీలో కొందరి ప్రవర్తనకు కారణం కనిపెట్టాలి. మీ జనాభాను నియంత్రించాలి. తాము కరోనాకు 'టీకా' తీసుకున్నట్టే మీకూ ఏదో ఓ మందు వెయ్యాలి. మనిషి కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధపడే మీ జాతిని లేకుండా చేయాలనుకోవడం మాత్రం కరెక్టు కాదు అన్నాడు అబ్బాయి.

రెండు కాళ్లున్న మనుషులే కాదు, నాలుగు కాళ్లూ,తోకా ఉన్న జీవులందరికీ జీవించే హక్కు ఉన్నది అంది డాంకీ.

ఏపీకి మెడ మీద కత్తిలా ట్రిబ్యునల్?

వి. శంకరయ్య



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణానదీ జలాల పంపిణీ గురించి 1956 అంతర్ రాష్ట్ర జల వివాదాల చట్టం కింద విచారణ సాగిస్తున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ రైతాంగం మెడ మీద కత్తిలా వేలాడుతోంది. ఇందుకు ప్రథమ ముద్దాయి జగన్‌మోహన్ రెడ్డి. రెండవ ముద్దాయి కేంద్ర ప్రభుత్వం. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అంతర్గత నదీ జలాల వినియోగంపై తీవ్ర కసరత్తు సాగుతున్నదే గాని అసలుకే మోసం తెచ్చే అంతర్ రాష్ట్ర జల వివాదాలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు.

కృష్ణానది జలాల పంపిణీలో ట్రిబ్యునళ్ల ఏర్పాటు చాల చిత్రమైనది. బచావత్ ట్రిబ్యునల్ గడువు ముగిసిన తర్వాత 2004లో బ్రిజేశ్ కుమార్ అధ్యక్షతన రెండవ ట్రిబ్యునల్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2010లో మధ్యంతర తీర్పు వెలువరించింది. అయితే ఈ తీర్పు న్యాయ బద్ధంగా లేదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. మధ్యంతర తీర్పు కాబట్టి తన వాదనను ట్రిబ్యునల్‌కు నివేదించమని సుప్రీంకోర్టు ఆదేశించింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో తుది తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు మధ్యంతర తీర్పునకు ఏమాత్రం భిన్నంగా లేదు. తిరిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టుకెళ్లితే తీర్పు నోటిఫై కాకుండా స్టే మంజూరు చేసింది. అప్పటి నుంచి పదేళ్లకు పైగా ఈ కేసు పరిష్కారం కాలేదు. ఫలితంగా న్యాయపరంగా కృష్ణాబేసిన్‌లో బచావత్ ట్రిబ్యునల్ అమలులో వుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను 2014లో విభజించారు. రాష్ట్ర విభజన చట్టంలో సాగునీటి ప్రాజెక్టులు నీటి పంపిణీ గురించి స్పష్టంగా నిబంధనలు పొందుపర్చారు. సెక్షన్ 85 సబ్ సెక్షన్ 8 (ఎ) (1)లో ఈపాటికే 1956 అంతర్ రాష్ట్ర జల వివాదాల చట్టం కింద నియమించిన ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులు అమలు జరగాలని పొందుపర్చారు. సెక్షన్ 89లో ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు జరగకుండా మిగులు నీరు వుంటే (బచావత్ ట్రిబ్యునల్ చేసి వుంది) రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని ఒక వేళ నీటి ఎద్దడి వుంటే ప్రొటోకోల్ నిర్ణయించేందుకు కృష్ణాట్రిబ్యునల్ గడువు పొడిగించి బాధ్యత అప్పగించాలని స్పష్టంగా వుంది. ఈ సెక్షన్ మేరకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ గడువు పెంచి ఈ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ మొదలు పెట్టింది. ట్రిబ్యునల్ ముందు తెలంగాణ 18 అంశాలను, ఆంధ్రప్రదేశ్ 13 అంశాలను విచారణకు అఫిడవిట్‌లు దాఖలు చేశాయి. తెలంగాణ అఫిడవిట్‌లోని అంశాలు పరిశీలిస్తే మున్ముందు రానున్న తీవ్ర ప్రమాదం పసిగట్ట గలం. కేసీ కెనాల్ సాగర్ కుడి కాలువ తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టు బేసిన్ ఆవల వుందని అక్కడ పంటల విధానం మార్పు చేసి మిగులు నీరు తమకు కేటాయించాలని కోరింది. అంతేకాదు ఒక ఆయకట్టుకు రెండు మార్గాల నుంచి నీళ్లు వస్తే ఒక వైపు నుంచి వచ్చే నీటి వాటా తగ్గించి తమకు కేటాయించాలని కూడా కోరింది. కృష్ణాడెల్టా ఉదాహరణగా చూపింది. మరో వైపు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సెక్షన్ 89 కింద విచారణ అసమగ్రంగా వుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన మొత్తం నీళ్లు తిరిగి పంపిణీ చేయాలనీ అందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ట్రిబ్యునల్ నియామకం జరగాలని సుప్రీంకోర్టుకెక్కారు. ఈ నేపథ్యంలో 2020లో జరిగిన రెండవ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో 1956 అంతర్ రాష్ట్ర జల వివాదాల చట్టం కింద కొత్త ట్రిబ్యునల్ నియమించాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర జల వనరుల శాఖ అప్పటి మంత్రి షెకావత్ సుప్రీంకోర్టులో వున్న కేసు వెనక్కి తీసుకొంటే కొత్త ట్రిబ్యునల్ నియమిస్తామని ప్రకటించారు. ఆ సమావేశంలో వున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మూగ నోము పట్టారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా డిసెంట్ (అసమ్మతి)నోట్ పెట్టలేదు. ఈ దెబ్బతో మొత్తం ఆంధ్రప్రదేశ్ సాగునీటి వ్యవస్థను ఐసీయూలోనికి జగన్‌మోహన్‌రెడ్డి నెట్టారు. వాస్తవంలో రెండు రాష్ట్రాల మధ్య ఏ తగాదా పరిష్కారం కావాలన్నా రాష్ట్ర విభజన చట్టం కరదీపికగా వుంది. పైగా విభజన చట్టం మేరకు ఒక ట్రిబ్యునల్ పనిచేస్తోంది. దాని ముందు తెలంగాణ తమ వాదన వినిపిస్తోంది. కొన్నాళ్ల పాటు కేసీఆర్ సెక్షన్ 89 అసమగ్రంగా వుందని పార్లమెంటులో సవరించాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరి వున్నారు. జగన్‌మోహన్ రెడ్డి మౌనంతో కొత్త ట్రిబ్యునల్ నియామకానికి ఆమోదముద్ర పడింది. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదని కేసీఆర్‌తో వున్న తగాదా ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను కోల్డ్‌స్టోరేజ్‌లో పడేసింది. కేసీఆర్ అడిగినపుడల్లా ఫైల్ న్యాయ శాఖ వద్ద వుందని చెబుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సరిగ్గా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోనికి వచ్చేసినట్లు భ్రమించి అందుకు అండగా అప్పటి వరకు కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న ఫైల్ బయటికి తీసి కొత్త ట్రిబ్యునల్ నియామకానికి ఆదేశాలు ఇచ్చింది. ఈ దెబ్బతో అప్పటి వరకు ఐసీయూలో వున్న ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటిలేటర్ పైకి నెట్టింది. ఏ పని చేయాలన్నా రాజకీయ ప్రయోజనం లేనిదే చేయదని మోదీ ప్రభుత్వం మరొక మారు రుజువు చేసింది.

విషాదమేమంటే ఆంధ్ర ప్రదేశ్ ప్రయోజనాలకు విఘాతం కలిగేందుకు తనే కారణమైన పూర్వ రంగంలో జగన్‌మోహన్ రెడ్డి సర్కారు ట్రిబ్యునల్ నియామకం సరికాదని సుప్రీంకోర్టు కెక్కింది గాని ఈ కేసు విచారణకు తీసుకు వచ్చే కృషి మాత్రం చేయ లేదు. ఇప్పటికీ ఈ కేసు సుప్రీంకోర్టులో వుంది. కొసమెరుపు ఏమంటే పుంగనూరు అల్లర్ల సందర్భంగా తెలుగు దేశంనేతలపై మోపిన కేసులో హైకోర్టు వారికి బెయిల్ ఇస్తే సుప్రీంకోర్టులో అప్పీలు చేసి కేసు విచారణకు వచ్చేవిధంగా జగన్ ప్రభుత్వం కృషి చేసింది గాని రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు చెందిన కేసుపై శ్రద్ధ కనపర్చలేదు.

ప్రస్తుతం రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం ఏర్పడింది. జగన్ లాగా కాకుండా సాగునీటి రంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సమగ్ర అవగాహన వుంది. తను అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పోలవరం మొదలు కొని సాగునీటి రంగంపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కానీ, మొత్తం రాష్ట్రం మెడ మీద కత్తిలా వేలాడుతున్న ట్రిబ్యునల్ గురించి గానీ, జగన్ సర్కారు సుప్రీంకోర్టులో వేసిన కేసు గురించి సమీక్ష జరప లేదు. గతంలోలాగా కాకుండా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కూడా విచారణను వేగవంతం చేస్తోంది. ఆగస్టు ఆఖరు వారంలో జరగనున్న విచారణ సందర్భంగా సమర్థవంతమైన వాదనతో ఏపీ అధికారులు వెళ్లవలసి ఉంది. తెలంగాణ మాత్రం స్టేట్ మెంట్ ఆఫ్ కేస్ సమగ్రంగా వేసింది. కాని ఆంధ్రప్రదేశ్ వైపు న్యాయపరమైన చర్యలు ఆశాజనకంగా లేవు. గత ఆరేడేళ్లుగా తెలంగాణ తరఫున లాయర్ వైద్యనాథన్ సమర్థవంతంగా ట్రిబ్యునల్ మొదలుకొని సుప్రీంకోర్టులో అంతర్ రాష్ట్ర జల వివాదాల కేసులు వాదిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులు కూడా ఈ అంశం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు రాలేదు. రాష్ట్రం మొత్తం ప్రయోజనాలు ఇమిడి వున్న ట్రిబ్యునల్ ప్రస్తావన ప్రభుత్వం వైపు నుంచి సమాచారం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ట్రిబ్యునల్ నియామకంపై సుప్రీంకోర్టులో వున్న కేసుతో పాటు ట్రిబ్యునల్‌లో విచారణ సమర్థవంతంగా నిర్వహించ వలసి ఉంది. న్యాయపరంగా ఆంధ్రప్రదేశ్ వైపు బలమైన అంశాలున్నాయి. ముందుగా ట్రిబ్యునల్ నియామకాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేయాలి. తెలంగాణకు ఏదైనా అన్యాయం జరిగి ఉంటే బేసిన్ మొత్తం మీద నీటి పంపిణీ జరిగినప్పుడు తప్ప మరో విధంగా పరిష్కారం కాదు. రెండు రాష్ట్రాల మధ్య ఏ సమస్య పరిష్కారం కావాలన్నా రాష్ట్ర విభజన చట్టం మేరకే జరగాలి. రాష్ట్ర విభజన చట్టం మేరకు ట్రిబ్యునల్ విచారణ సాగిస్తున్న దశలో దాన్ని పక్కన బెట్టి 1956 అంతర్ రాష్ట్ర జల వివాదాల చట్టం కింద కొత్తగా మరొక ట్రిబ్యునల్ నియామకం సరికాదని న్యాయ పరంగా పోరాడ వలసి వుంది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వున్న ఈ ప్రభుత్వం ఏమాత్రం అలసత్వం వహిస్తే తుదకు కృష్ణ డెల్టా కేటాయింపులకు కూడా ఎసరు పెట్టే అవకాశం లేకపోలేదు.

విశ్రాంత పాత్రికేయులు, 984839401

రుణాల మాఫీ కార్పొరేట్లకే

డా॥ జ్ఞాన్‌పాఠక్

బ్యాంకులకు కార్పొరేట్లు, బడా వాణిజ్యవేత్తలు చెల్లించవలసిన బకాయిలు ఇప్పుడు గణనీయంగా తగ్గిపోయాయని మోదీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. 2014 లో తాము అధికారంలోకి వస్తే బ్యాంకుల్లో అప్పులు తీసుకొన్న వారి నుంచి పూర్తిగా వసూలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక మంత్రిత్వశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరీ ఇటీవల రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పిన విషయమే మోదీ ప్రచారం అబద్ధమని స్పష్టం చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులకు చెల్లించవలసిన రుణాల మొత్తం 1.70 లక్షల కోట్లు ఉందని తెలిపారు. 2014 ఏప్రిల్‌లో మోదీ ప్రధానమంత్రిగా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి 2024 మార్చి చివరి వరకు 14.56 లక్షల కోట్ల రూపాయలు రద్దు చేశారు. బడా కార్పొరేట్లు పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకే ఈ బకాయిలను రద్దు చేశారు. చిన్న చిన్న రైతులు లేదా సామాన్య ప్రజలు అప్పులు తీసుకుని గడువు లోపల చెల్లించకపోతే వారి ఇళ్లకు వెళ్లి నానా గందరగోళం చేసి ఇంట్లో ఉన్న వస్తువులను బయట విసిరివేస్తారు. కార్పొరేట్ల జోలికి ప్రభుత్వాలు వెళ్లవని చెప్పడానికి బ్యాంకులకు చెల్లించవలసిన బకాయిలే స్పష్టం చేస్తున్నాయి. గత సంవత్సరం కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి భగవత్‌కరాద్ లోక్‌సభలో రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో, షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులకు 2014-15 వ సంవత్సరం నుంచి 14.56 లక్షల కోట్లు రద్దు చేసినట్టు తెలిపారు. మొత్తం రద్దు చేసిన బకాయిలలో 7.40 లక్షల కోట్లు భారీ పరిశ్రమలు, సర్వీసు సంస్థల బకాయిలు ఉన్నాయి. 2023-24 సంవత్సరంలో వసూలు చేసిన మొత్తం కేవలం 46 వేల 36 కోట్ల రూపాయలు మాత్రమే. అలాగే 2014-15 నుంచి 2022-23 వరకు వసూలు చేసిన బకాయిల మొత్తం 2.04 లక్షల కోట్లు మాత్రమే. అంటే గత సంవత్సరం వరకు కేవలం 2.50 లక్షల కోట్లు మాత్రమే వసూలైంది. దీని అర్థం 2014-15 నుంచి మోదీ పాలనా కాలంలో 13.76 లక్షల కోట్లు బడా బాబులకు రద్దు చేశారు. మోదీ ఎవరి కోసం పరిపాలిస్తున్నట్టు? కార్పొరేట్ల కోసమా! ఓట్లు వేసే ప్రజలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఈ విషయం స్పష్టం చేస్తోంది.

అధికారంలో ఉన్న రాజకీయనాయకులు, ప్రభుత్వ అధికారులు, కార్పొరేట్లు బడా వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు కుమ్మక్కై షెడ్యూల్డు వాణిజ్యబ్యాంకులలో ఉన్న డిపాజిట్లను కైంకర్యం చేస్తున్నారు. ప్రస్తుత కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఇటీవల నూతన విధానాలను అమలు చేయడం ద్వారా ప్రజల నుంచి డిపాజిట్లు సమీకరించాలని, తద్వారా డిపాజిట్లు, రుణాలు ఇవ్వటం మధ్య ఉన్న అంతరాన్ని అధిగమించేందుకు ఉపయోగపడాలని కోరారు. ఎన్నో ఆశలతో, అవసరాలకు ఉపయోగపడతాయని బ్యాంకుల్లో కష్టార్జితాన్ని డిపాజిట్లు చేసుకున్న వారి డబ్బును కార్పొరేట్లకు, బడా పారిశ్రామికవేత్తలకు, వాణిజ్యవేత్తలకు కట్టబెడుతున్న మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని డిపాజిట్‌దారులు భావించడంలో ఎలాంటి తప్పులేదు. ఆగస్టు 10 వ తేదీన రిజర్వుబ్యాంకు సెంట్రల్‌బోర్డు డైరెక్టర్ల సమావేశంలో ఆర్థికమంత్రి సీతారామన్ మాట్లాడుతూ నూతన, ఆకర్షణీయమైన పథకాలను రూపొందించి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలని కోరారు. ఆగస్టు 8 వ తేదీన ఆర్బీఐ గవర్నరు శక్తికాంతదాస్ మాట్లాడుతూ డిపాజిట్లు- ఇస్తున్న రుణాలకు మధ్య అంతరం పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఇతర సమస్యలను కూడా ప్రస్తావిస్తూ ఈ పరిస్థితి బ్యాంకుల వ్యవస్థ నిర్మాణమే దెబ్బతింటుందని అన్నారు. అందువల్ల బ్యాంకులు డబ్బు పొదుపు చేసుకోవాలని ప్రజల్లో ప్రచారం చేస్తూ డిపాజిట్‌లు పెంచాలని కోరారు. బ్యాంకింగ్ వ్యవస్థ సంక్షోభంలో పడిందని కేంద్ర ఆర్థికమంత్రి, ఆర్బీఐ గవర్నరు బ్యాంకులకు చేసిన విజ్ఞప్తులే రుజువు చేస్తున్నాయి.

ప్రజల దగ్గర బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడానికి మిగులు ధనం ఉండటంలేదు. అందువల్లనే డిపాజిట్లు తక్కువగా వస్తున్నాయి. బ్యాంకులు తక్కువ వడ్డీ రేట్లను డిపాజిట్లపై చెల్లిస్తున్నాయి. ఎక్కువగా ఉన్న ద్రవ్యోల్బణం రేటు తగ్గకపోవటానికి బ్యాంకులు తక్కువ వడ్డీ రేట్లను ఇవ్వడమే ప్రధాన కారణం. బడా బాబులకి ఇచ్చే రుణాలు తిరిగి రాకపోవటం వల్ల ప్రజలు తమ డిపాజిట్లను కోల్పోతున్నారు. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఒక సమావేశంలో మాట్లాడుతూ డిపాజిట్లపై వడ్డీరేట్లను బ్యాంకులే నిర్ణయించటానికి స్వేచ్ఛ ఉంది, 2019 నవంబరులో పెద్ద నోట్లను రద్దు చేసిన నాటి నుంచి ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థ మీద గణనీయంగా విశ్వాసాన్ని కోల్పోయారని చెప్పారు. డిపాజిట్‌దార్లకు అవసరమైనప్పుడు తిరిగి చెల్లించకపోతే బ్యాంకులపై విశ్వాసం ఉంటుందని ఎలా భావిస్తారు? అపర ధనవంతులు తమ డబ్బుకు భద్రత ఉండటం కోసం అనేక మార్గాలు వెతుకుతారు. భూములు, బంగారం కొనుగోలు చేస్తారు. పేదలు, సామాన్యులు తప్పించుకోలేని ఖర్చు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులకు లోనవుతారు. ప్రత్యేకించి ఆరోగ్యం, ఆహారం కోసం అధికంగా మన దేశంలో ఖర్చుపెడుతున్నారు. ప్రభుత్వం ఆరోగ్యం, ఆహార భద్రతను కల్పించడంలో ప్రభుత్వం విఫలం కావడం వల్లనే ప్రజలు ఎనలేని ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలు తమకు అవసరమైనప్పుడు బ్యాంకులనుంచి డబ్బు తీసుకునేందుకు ఎకౌంట్లలో పెద్దగా ఉండటంలేదు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం తమనుఏమాత్రం పట్టించుకోవటంలేదని ప్రజలు భావిస్తున్నారు. జనాన్ని పట్టించుకోకుండా మోదీ ప్రభుత్వం డిపాజిట్లను దుర్వినియోగం చేస్తున్నది. బ్యాంకులలో ఉన్న డిపాజిట్ల డబ్బు ఎక్కువ భాగం కార్పొరేట్లు, బడా వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు రుణాలుగా తీసుకుని తిరిగి చెల్లించటం లేదు. వారు చెల్లించకపోయినా ఆ డబ్బును కొంతకాలానికి కేంద్రప్రభుత్వం రిజర్వుబ్యాంకు ద్వారా రద్దు చేస్తున్నది. అంటే డిపాజిట్ దార్ల పట్ల మోదీ ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం కూడా ఉండటంలేదు. షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) చాలా ఎక్కువగా ఉంటున్నాయి. 2024 మార్చి 31 నాటికి ఈ నిరర్థక ఆస్తులు షెడ్యూలు వాణిజ్య బ్యాంకులలో 4.80 లక్షల కోట్లు ఉన్నాయని ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరి రాజ్యసభలో వెల్లడించారు. ఇదే కాలంలో 1.70 లక్షల కోట్లు రద్దు చేసినట్టు చెప్పారు. అయితే గత ఐదేళ్లలో షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులలో ఎన్‌పీఏలు క్రమంగా తగ్గుతున్నాయని ఆయన తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో 9.9 లక్షల కోట్లు రద్దు చేశారని కేవలం 1.84 లక్షల కోట్లు మాత్రమే వసూలు చేశారని తెలిపారు. ఈ విషయాలేవీ సామాన్య ప్రజలకు తెలియకుండా దాచిపెట్టటమేకాక మోదీ ప్రభుత్వం అబద్ధాలమారిగా తయారయ్యింది.

అత్యుత్తమ విద్యాసంస్థగా 'ఐఐటీ మద్రాస్'

న్యూఢిల్లీ: దేశంలో ఉత్తమ విద్యాసంస్థల జాబితాను కేంద్ర విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. ఇందులో 'ఐఐటీ మద్రాస్ మరోసారి ఉత్తమ విద్యాసంస్థగా నిలిచింది. అత్యుత్తమ విద్యాసంస్థ (ఓవరాల్)గా వరుసగా ఆరో ఏడాది అగ్రస్థానంలో నిలిచింది. ఉత్తమ విశ్వవిద్యాలయాల విభాగంలో ఐఐఎస్సీ బెంగళూరు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ కింద రూపొందించిన ఈ జాబితాను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విడుదల చేశారు. యూనివర్సిటీలు, కాలేజీలు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్లు, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, మెడికల్.. ఇలా మొత్తం 13 విభాగాల్లో ర్యాంకులు ప్రకటించారు. విద్యాసంస్థల్లో అందిస్తోన్న విద్యాబోధన, కల్పిస్తున్న సౌకర్యాల ఆధారంగా 2016 నుంచి ఈ ర్యాంకులను కేంద్రం ప్రకటిస్తోంది.

సెబీ ఛైర్మన్‌ను విచారణ చేయాలి: సూలే

ముంబై : సెబీ ఛైర్‌పర్సన్ మధబీ బుచ్‌పై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలపై పార్లమెంటులో చర్చ జరగాలని ఎన్‌సీపీ (ఎస్‌పీ) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే సోమవారం అన్నారు. షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ శనివారం సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) ఛైర్‌పర్సన్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది. అదానీ అక్రమ నగదు కుంభకోణంలో ఉపయోగించిన అస్పష్టమైన ఆఫ్‌షోర్ ఫండ్‌లలో ఆమెకు, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని పేర్కొంది. లోక్‌సభ సభ్యురాలు సూలే ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఆరోపణలపై పార్లమెంటులో చర్చ జరగాలని అన్నారు. 'వాటికి సంబంధించిన వివరాల కోసం వేచి చూద్దాం' అని తెలిపారు. ఇదిలాఉండగా, సెబీ ఛైర్‌పర్సన్‌పై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) దర్యాప్తు చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌ను బీజేపీ సోమవారం తిరస్కరించింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థను బలహీనపరచడం, దేశంలో పెట్టుబడులను నాశనం చేయడం వంటి బూటకమని పేర్కొంది.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీగా డబ్బు, బంగారం

భువనేశ్వర్: ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో లెక్కకు మించిన కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులు వెలుగుచూశాయి. రిటైర్డ్ ఇంజినీర్ తారా ప్రసాద్ మిశ్రా భారీగా అక్రమాస్తులు కూడబెట్టారన్న సమాచారంతో భువనేశ్వర్, కటక్, ఝార్సిగూడలో ఏకకాలంలో అధికారులు సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తారా ప్రసాద్ వద్ద 10 స్థలాలు, ఏడు ఫ్లాట్లు, రూ.2.7 కోట్ల బ్యాంకు డిపాజిట్లు 1.5 కిలోల బంగారం, రూ.6 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు రెండు లగ్జరీ కార్లు, అత్యంత ఖరీదైన చేతి గడియారాలు, విదేశీ కరెన్సీ అతని వద్ద ఉన్నట్లు అధికారులు తెలిపారు.

హత్యాచారం తర్వాత హాయిగా నిద్రపోయా

పోలీసు విచారణలో నిందితుడి వెల్లడి

కోల్‌కతా: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ కేసులో సంచలన విషయాలను పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడి గురించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో నిందితుడు వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన అనంతరం తాను ఉండే ప్రాంతానికి తిరిగొచ్చి హాయిగా నిద్రపోయినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత ఉదయం సాక్ష్యాలు చెరిపివేయడానికి తన దుస్తులపై ఉన్న రక్తపు మరకలు కనిపించకుండా ఉతుక్కున్నాడని చెప్పారు. అయితే... అతడి బూట్లపై ఉన్న రక్తపు మరకల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. పౌర వలంటీర్ అయిన నిందితుడికి ఈ ఆస్పత్రితో ఎలాంటి సంబంధం లేదని, అప్పుడప్పుడు ఇక్కడికి వస్తాడని విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన అనంతరం సిటీ పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ మెడికల్ కళాశాలను రెండో రోజు పరిశీలించారు. నిరసనకు దిగిన వైద్యులతో సమావేశమయ్యారు. విచారణ పారదర్శకంగా జరుగుతోందని, ఈ కేసులో ఎలాంటి వదంతులను వ్యాపింపజేయవద్దని కోరారు. ఈ కేసులో ఇంకెవరి ప్రమేయమైనా ఉందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ... ఇప్పటి వరకూ అలాంటి ఆధారాలు లభించలేదని, బాధితురాలి తుది పోస్టుమార్టమ్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. తమ దర్యాప్తులో లభించిన ఆధారాలతో నివేదికను పోల్చి చూడాల్సి ఉంటుందని వెల్లడించారు.

మొదట హత్య... ఆ తర్వాత అత్యాచారం

ప్రాథమిక పోస్టుమార్టమ్ నివేదిక ప్రకారం బాధితురాలి కళ్లు, నోరు, అంతర్గత అవయవాల నుంచి రక్తస్రావం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇతర భాగాల్లో కూడా గాయాలున్నట్లు తేలింది. అయితే వైద్యురాలిని మొదట హత్య చేసి... ఆ తర్వాత నిందితుడు అత్యాచారానికి పాల్పడి ఉంటాడని మరో పోలీసు అధికారి వెల్లడించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ పనిచేసిన సిబ్బందిని విచారించినట్లు.. సీసీ టీవీ దృశ్యాలు పరిశీలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేపట్టినట్లు వివరించారు. ఈ కేసు విషయంలో పోలీసులు ఎలాంటి విషయాలను దాచడం లేదని పోలీసు కమిషనర్ తెలిపారు. కాగా, నిందితుడు సంజయ్ రాయ్ దర్యాప్తు సమయంలో ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా... తనను ఉరి తీయాలనుకుంటే తీసుకోవాలని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అతడి ఫోన్ నిండా అశ్లీల వీడియోలు ఉన్నాయని, అతడికి ఇప్పటికే నాలుగు పెళ్లిళ్లు జరిగినట్లు తెలుస్తోందన్నారు.

సీబీఐ అరెస్టుపై సుప్రీంకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసులో అరెస్టయ్యి జైల్లో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సీబీఐ తనను అరెస్ట్ చేయడాన్ని దేశ అత్యున్నత న్యాయ స్థానంలో సవాల్ చేశారు. ఈ కేసులో కేజ్రీవాల్ రెగ్యులర్ బెయిల్ కోసం పిటిషన్ వేసినట్లు ఆప్ న్యాయ బృందం సోమవారం వెల్లడించింది. కాగా, మద్యం విధానం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం కొట్టివేసిన విషయం తెలిసిందే. బెయిల్ కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది. మద్యం కుంభకోణం ఆరోపణల నేపథ్యంలో ఈ ఏడాది మార్చిలో కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన తీహార్ జైల్లోనే ఉంటున్నారు. బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ... ప్రస్తుతం సీబీఐ కేసులో తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. మరోవైపు కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 20 వరకు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

హసీనాకు ఆశ్రయం సరైనదే: శశిథరూర్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చి భారత ప్రభుత్వం సరైన నిర్ణయమే తీసుకుందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పేర్కొన్నారు. ఆయన ఓ ఆంగ్ల వార్తా ఛానెల్‌తో మాట్లాడుతూ పొరుగుదేశంలో అధికార మార్పు భారత్‌ను ఆందోళనకు గురిచేసే అంశం కాదన్నారు. 'ఆమెకు మనం సాయం చేయకపోతే... అది భారత్‌కు అవమానం. భవిష్యత్తులో ఎవరూ మనకు మిత్రులుగా ఉండేందుకు ఇష్టపడేవారు కాదు. మీ మిత్రులు సమస్యల్లో ఉంటే ఎప్పుడూ సాయం చేయడానికి తటపటాయించకూడదు. కచ్చితంగా వారిని సురక్షితంగా ఉంచేలా చూడాలి. ఇప్పుడు భారత్ కూడా చేసింది అదే. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. అంతకు మించి నేనేమీ కోరుకోవడం లేదు. ఒక భారతీయుడిగా మనం ప్రపంచం కోసం నిలబడే విషయంలో కొన్ని ప్రమాణాలున్నాయి. ఆమెను ఇక్కడికి తీసుకొచ్చి రక్షణ కల్పించి ప్రభుత్వం సరైన పనే చేసింది' అని థరూర్ పేర్కొన్నారు. 'ఆమె ఇక్కడ ఎన్నాళ్లు ఉంటారన్నది మనకు అనవసరం. మనం ఎవరినైనా ఇంటికి ఆహ్వానించిన తర్వాత ఎప్పుడు వెళ్లిపోతారు అని అడగం. ఆమె ఇక్కడ ఎన్నాళ్లు ఉండాలనుకుంటే అన్నాళ్లు మనం వేచి చూసే వైఖరి పాటించాలని భావిస్తున్నాను' అని శశిథరూర్ అభిప్రాయపడ్డారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై దాడుల విషయంలో థరూర్ స్పందిస్తూ.. 'కచ్చితంగా అక్కడ కొన్ని దాడులు జరిగాయి. అది నిజం. అదే సమయంలో కొందరు ముస్లింలు అక్కడి హిందువులను, దేవాలయాలను కాపాడుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇన్ని చెడు వార్తల మధ్య అదొక్కటే కొంచెం ఊరట కలిగించే అంశం' అని వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికాకు తలొగ్గితే అధికారంలో కొనసాగేదాన్నేనని, సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టలేకే పదవి నుంచి వైదొలగానని షేక్ హసీనా ఇటీవల పేర్కొన్నారు. త్వరలోనే స్వదేశానికి చేరుకుంటానని చెప్పారు. 'నేను సెయింట్ మార్టిన్ ద్వీపంపై సార్వభౌమత్వాన్ని అప్పగించి... అమెరికాకు బంగాళాఖాతంలో పట్టు లభించేలా చేస్తే పదవిలో కొనసాగేదాన్ని. దానికి ఇష్టపడక ప్రధాని పదవికి రాజీనామా చేశాను' అని ఆమె ఆరోపించారు. ప్రజలే తన బలమని, వారు తనను వద్దనుకోవడంతో దేశం వీడానని చెప్పారు. తాను ఓడిపోయినా ప్రజలు గెలిచారని వ్యాఖ్యానించారు. వారి కోసమే తమ కుటుంబం ప్రాణత్యాగాలు చేసిందన్నారు. మరోవైపు హసీనా ఆరోపణలను అమెరికా తోసిపుచ్చింది.

విగ్రహాల ధ్వంసం విచారకరం

బంగ్లాదేశ్ విమోచన దృశ్యాలతో ముజిబ్‌నగర్‌లో నిర్మించిన షహీద్ మెమోరియల్‌ను బంగ్లాదేశ్ ఆందోళనకారులు ధ్వంసం చేయడం విచారకరమని శశిథరూర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆందోళనకారుల అజెండా స్పష్టంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నూతన తాత్కాలిక ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని శాంతిభద్రతలు కాపాడాలని కోరారు.

నట్వర్ సింగ్‌కు నేతల నివాళి

ఢిల్లీలో ముగిసిన అంత్యక్రియలు

న్యూఢిల్లీ: విదేశాంగ శాఖ మాజీ మంత్రి కె.నట్వర్ సింగ్ భౌతిక కాయానికి సోమవారం ఇక్కడ విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో సహా అనేక మంది రాజకీయ నాయకులు నివాళులర్పించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నట్వర్ సింగ్ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని లోధీ శ్మశానవాటికలో సోమవారం మధ్యాహ్నం నట్వర్‌సింగ్ భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాజస్తాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా, కాంగ్రెస్ నాయకుడు, హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హుడా, నట్వర్ సింగ్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు శ్మశానవాటిక వద్ద నట్వర్ సింగ్‌కు నివాళులర్పించారు. కేంద్ర మాజీ మంత్రి ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రిలో గత కొన్ని వారాలుగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. నట్వర్ సింగ్ 1931లో రాజస్తాన్‌లోని భరత్‌పూర్ జిల్లాలోని జఘినా గ్రామంలో జన్మించాడు. ఆయన తన రాజకీయ జీవితంలో దౌత్యవేత్తగా వన్నె తీసుకువచ్చారు. నట్వర్ సింగ్ అనేక పదవులు అలంకరించారు. దేశానికి చేసిన సేవకు గాను మాజీ విదేశాంగ మంత్రికి 1984లో పద్మభూషణ్ అవార్డు లభించింది. నట్వర్ సింగ్ నిష్క్రమణను కేంద్ర మంత్రి షెకావత్... దౌత్య, రాజకీయ రంగాలకు తీరని లోటు అని అభివర్ణించారు. దౌత్యవేత్తగా దేశానికి సేవ చేసిన తీరు, దేశ ప్రయోజనాల కోసం రాజకీయ నాయకుడిగా పనిచేసిన తీరు రెండూ చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడతాయని ఆయన ఇక్కడ విలేకరులతో అన్నారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ నట్వర్ సింగ్ అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ-1 ప్రభుత్వంలో 2004-05 కాలానికి భారత విదేశాంగ మంత్రిగా పనిచేశారు. ఆయన పాకిస్తాన్‌లో రాయబారిగా కూడా పని చేశారు. నట్వర్ సింగ్ 'ది లెగసీ ఆఫ్ నెహ్రూ : ఎ మెమోరియల్ ట్రిబ్యూట్', 'మై చైనా డైరీ 1956-88' వంటి అనేక పుస్తకాలను రచించారు. వఅశ్రీ ఆత్మకథ పేరు 'వన్ లైఫ్ ఈజ్ నాట్ ఇనఫ్'.

దిల్లీ హైకోర్టులో పూజా ఖేడ్కర్‌కు ఊరట

న్యూఢిల్లీ: చీటింగ్, ఫోర్జరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు ఢిల్లీ హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తక్షణ కస్టడీ అవసరం లేదంటూ ఆమెకు తాత్కాలిక ఉపశమనం కలిగింది. అరెస్టు నుంచి ఈ నెల 21 వరకు రక్షణ కల్పించింది. ముందస్తు బెయిల్ కోసం పూజ పిటిషన్ వేసిన నేపథ్యంలో ఢిల్లీ పోలీసులకు కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. పూణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ... ఆమెను ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది. నకిలీ పత్రాలతో పరీక్ష పూర్తి చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయడంతో పాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ కోర్టు ఇదివరకే నిరాకరించింది. ఈ క్రమంలో ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఆమెపై వచ్చిన ఆరోపణలకు సమాధానం ఇవ్వడానికి తగిన సమయం ఇవ్వాలని పూజ తరపు న్యాయవాదులు కోర్టులో వాదించారు. ఈ క్రమంలోనే ఆమెకు ఊరట లభించింది. ఇదిలా ఉంటే... ఢిల్లీ పోలీసులు ఇప్పటికే ఫోర్జరీ కేసులో దర్యాప్తు ప్రారంభించారు. దీని విచారణకు హాజరుకావాలని త్వరలో ఆమెకు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. ఇక ఆమె అరెస్టు భయంతో దుబాయ్‌కి పరారైనట్లు వార్తలు వచ్చాయి. ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. గత కొద్దిరోజులుగా ఆమె ఎక్కడుందనే దానిపై ఎలాంటి సమాచారం లేదు.

ఎల్జీకి కేజ్రీవాల్ లేఖపై జైలు అధికారుల అభ్యంతరం

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆరోపణలపై తీహార్ జైలుకు వెళ్లినప్పటి నుంచి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్... మోదీ సర్కారుపైనా, లెఫ్టినెంట్ గవర్నరుపైనా విమర్శలు గుప్పిస్తున్నారు. జైలులోనే తనను చంపేందుకు కుట్ర జరుగుతోందని ఇటీవల ఆయన చేసిన ఆరోపణలను జైలు అధికారులు కొట్టివేశారు. తాజాగా జైలు నిబంధనలకు విరుద్ధంగా లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు ఆగస్టు 6న కేజ్రీవాల్ లేఖ రాయడంపై అధికారులు మండిపడ్డారు. ఢిల్లీ ప్రభుత్వం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాల్లో త్రివర్ణ పతాకాన్ని మంత్రి అతిశీ ఎగురవేస్తారంటూ ఎల్జీకి లేఖ రాయడం జైలు నిబంధనలకు విరుద్ధమని అధికారులు చెప్పారు. ఢిల్లీ ప్రిజన్ రూల్స్-2018 నిబంధలకు విరుద్ధంగా సీఎం ప్రవర్తించ రాదని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఆయనకు ఉన్న అధికారాలను కుదించాల్సి వస్తుందని తీహార్ జైలు నెంబర్ 2 సూపరింటెండెంట్ ముఖ్యమంత్రికి సూచించారు. లేఖలోని విషయాలు ఎలాంటి అథారిటీ లేకుండా మీడియాకు లీక్ కావడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది జైలు నిబంధనల కింద ఆయనకు కల్పించిన అధికారాలను దుర్వినియోగం చేయడమేనని పేర్కొన్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని సీఎంకు సూచించారు. కాగా, ముఖ్యమంత్రి నుంచి తమకు ఎలాంటి సమాచారం (లేఖ) అందలేదని ఎల్జీ కార్యాలయం తెలిపింది.

కోటా వివాదంపై అఖిలపక్షం: శరద్‌పవార్

పూణే: మరాఠాలు, ఇతర వెనుకబడిన తరగతుల మధ్య కోటా వివాదంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు విజ్ఞప్తి చేసినట్లు ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ సోమవారం తెలిపారు. రాష్ట్రంలో సామాజిక నిర్మాణం బాగుండేలా చర్యలు తీసుకోవాలని, వర్గాల మధ్య విద్వేషాలు లేకుండా చేయాలన్నారు. కోటా సమస్యపై తన వైఖరిని తెలుసుకోవాలని కోరుతూ మరాఠా క్రాంతి థోక్ మోర్చా కార్యకర్త రమేష్ కేరే పాటిల్ పూణేలోని తన నివాసంలో తనను కలిసిన తర్వాత పవార్ మీడియాతో మాట్లాడారు. కేరె పాటిల్ ఇచ్చిన మెమోరాండంను తాను స్వీకరించినట్లు పవార్ తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి షిండేతో సమావేశమైనప్పుడు కోటా వివాదంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. తనకు తగినట్లుగా భావించే నేతలను ఆహ్వానించాలని, ప్రతిపక్షంగా తాము కూడా సమావేశానికి హాజరై సహకరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో మరాఠా కోటా ఉద్యమానికి నాయకత్వం వహించిన మనోజ్ జరాంగే, రాష్ట్ర మంత్రి ఛగన్ భుజ్‌బల్ వంటి ఓబీసీ నేతలను షిండే ఆహ్వానించాలని పవార్ పేర్కొన్నారు. రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు 50 శాతం కోటా సీలింగ్‌ను ఉల్లంఘించరాదని సుప్రీంకోర్టు ఇప్పటికే తేల్చిచెప్పడంతో ప్రతిష్టంభన నెలకొందని... అందుకు అనుగుణంగా ముసాయిదా విధానాన్ని రూపొందించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుపై, ముసాయిదా బిల్లును సమీక్షించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటైందని... అది ఆరు నెలల్లో నివేదిక సమర్పిస్తుందని పవార్ చెప్పారు.

నిందితులను వదలొద్దు: ప్రియాంక

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్ జీ కార్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సోమవారం ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఘటన భయానకం, హృదయ విదారకమైన ఘటనగా ఆమె అభివర్ణించారు. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసి... నిందితులను కఠినంగా శిక్షించాలని మమత ప్రభుత్వానికి ప్రియాంక గాంధీ విజ్ఞప్తి చేశారు. తద్వారా మృతురాలి కుటుంబానికి, వైద్య సిబ్బందికి న్యాయం జరుగుతుందని ఆమె ఆకాంక్షించారు. పని ప్రదేశంలో మహిళల భద్రత అనేది పెద్ద సమస్యగా మారిందన్నారు. దీనికి తీవ్రమైన కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ నిందితులను ఉపేక్షించవద్దని స్పష్టంచేశారు.

ఎస్పీ నేత డింపుల్ మాజీ సహచరుడి అరెస్టు

లక్నో: అయోధ్యలో మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్ మాజీ ప్రతినిధి నవాబ్ సింగ్ యాదవ్‌ను ఉత్తరప్రదేశ్ పోలీసులు కన్నౌజ్‌లో సోమవారం అరెస్టు చేశారు. ఇటీవల అఖిలేశ్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనను అభినందిస్తున్న వీడియోను నవాబ్ షేర్ చేశారు. అఖిలేశ్‌తో ఉన్న మరికొన్ని ఫొటోలు కూడా ఆ వీడియోలో ఉన్నాయి. మీడియా కథనాల ప్రకారం ఉద్యోగం ఇస్తానని ఆశ చూపించి మైనర్ బాలికను, ఆమె అత్తను తన ఇంటికి నవాబ్ పిలిపించాడు. బాలిక తనను కలుసుకునేందుకు వచ్చినప్పుడు ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అయితే ఈ ఆరోపణలను రాజకీయ కుట్రగా నవాబ్ కొట్టివేశారు. తన రాజకీయ కెరీర్‌ను దెబ్బకొట్టేందుకే ఇలాంటి ఆరోపణలు చేసినట్టు తెలిపారు. ఇదే కేసులో రెండు నెలలుగా బాలికపై అత్యాచారం జరుపుతున్న ఆరోపణలపై మరో ఎస్పీ నేత మొయిద్ ఖాన్‌ను కూడా పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. అయోధ్యలో బాధితురాలి కుటుంబాన్ని ముగ్గురు సభ్యుల బీజేపీ ప్రతినిధి బృందం ఇటీవల పరామర్శించడంతో ఈ కేసు రాజకీయరంగు పులుముకుంది. బాధితురాలి కుటుంబానికి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ ప్రతినిధుల బృందం కోరింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మొయిద్ ఖాన్ సమాజ్‌వాదీ పార్టీ నేత అని, ఫైజాబాద్ ఎంపీ అవదేశ్ ప్రసాద్ బృందంలో ఉన్నాడని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇటీవల అసెంబ్లీలో ప్రకటించారు.

శంభు సరిహద్దు తెరవండి

హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలకు: సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: శంభూ సరిహద్దు రహదారిని పాక్షికంగా తెరవాలని సుప్రీంకోర్టు హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు శంభూ సరిహద్దు జిల్లాలు పాటియాల, అంబాల ఎస్పీలతో భేటీ అయి వారం రోజుల లోపు శంభూ సరిహద్దు జాతీయ రహదారిని తెరవాలని ఆదేశించింది. ఈ విషయంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ రహదారులు ఉన్నది పార్కింగ్ స్థలం కోసం కాదని పేర్కొంది. వెంటనే పంజాబ్ ప్రభుత్వం రైతులతో చర్చలు జరిపి... హైవే మీద నిలిపిన ట్రాక్టర్లను తొలగించేలా చూడాలని సూచించింది. అంబులెన్స్ రాకపోకలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థినీలు, స్థానిక ప్రయాణికుల అవసరాల కోసం శంభూ సరిహద్దును పాక్షికంగా తెరవాలని న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది.

రాహుల్ ఎప్పటికీ ప్రతిపక్షంలోనే: కంగన

న్యూఢిల్లీ: సినీ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురి బచ్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. 'రాహుల్ గాంధీ చాలా ప్రమాదకరమైన వ్యక్తి. అతడు ప్రధాని కాలేదనే నిరాశలో దేశ ఆర్థిక పరిస్థితిని అస్థిరపరచడానికి ప్రయత్నిస్తున్నారు. హిండెన్‌బర్గ్ నివేదికను ఆధారంగా చేసుకొని, స్టాక్ మార్కెట్ గురించి అసంతృప్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజలు ఆయనను ఎప్పటికీ గెలిపించరు. రాహుల్ ఎప్పటికీ ప్రతిపక్షంలోనే ఉండిపోతారు' అంటూ కంగన ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. భారతీయ స్టాక్ మార్కెట్ కూలిపోవాలని, ఎకానమీని ధ్వంసం చేయాలని కాంగ్రెస్ కోరుకుంటుందని దుయ్యబట్టారు. కాగా హిండెన్‌బర్గ్ నివేదికపై రాహుల్ గాంధీ స్పందిస్తూ... 'సెబీ' పవిత్రత దెబ్బతిందని విమర్శించారు. 'ఛైర్‌పర్సన్‌పై వచ్చిన ఆరోపణలతో సెబీ పవిత్రత మసకబారింది. దేశవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు ప్రస్తుతం ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు వేస్తున్నారు. సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురి ఇంకా ఎందుకు రాజీనామా చేయలేదు... ఒకవేళ పెట్టుబడిదారులు తాము కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోతే... ఎవరు జవాబుదారీగా ఉంటారు... ప్రధాని మోదీనా... సెబీ ఛైర్‌పర్సనా లేదా అదానీనా... ఈ అంశాన్ని సుప్రీంకోర్టు మరోసారి సుమోటోగా పరిశీలిస్తుందా' అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నలు లేవనెత్తారు. దీనివల్ల భారతీయ స్టాక్ మార్కెట్‌లో గణనీయమైన ప్రమాదం పొంచి ఉందనే విషయం ప్రజల దృష్టికి తీసుకురావడం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యత అని పేర్కొన్నారు.

బంగ్లా అల్లర్లు... భారత్‌కు ఉగ్ర ముప్పు

న్యూఢిల్లీ: రిజర్వేషన్ కోటాకు వ్యతిరేకంగా విద్యార్థులు, నిరసనకారులు చేట్టిన నిరసన హింసాత్మకంగా మారటంతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఆమె భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. ఆమె దేశం విడిచిపెట్టినప్పటి నుంచి అక్కడ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాత్కాలిక కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ మైనార్టీలు, హిందువులపై దాడులు కొనసాగుతున్నాయి. అయితే బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న అల్లర్లు, నెలకొన్న అనిశ్చితి కారణంగా ఉగ్రవాద సంస్థల నుంచి భారత్‌కు ముప్పు పొంచి ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. షేక్ హసీనా ప్రభుత్వాన్ని దించడానికి నిరసనలు చేపట్టిన వారంతా విద్యార్థులుగా కనిపించినప్పటికీ... మైనార్టీలు, హిందువులపై దాడులను గమనిస్తే వారివెనక ఉగ్రసంస్థల ప్రమేయం ఉన్నట్లు ఇంటెలిజెన్స్ అధికారులు పేర్కొంటున్నారు. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ), బంగ్లాదేశ్‌కు చెందిన అన్సరుల్లా బంగ్లా టీమ్ (ఏబీటీ)తో కలిసి... భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాద దాడులకు పాల్పడనున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వ మార్పు ఆపరేషన్‌లో పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) పాత్ర, జమాత్-ఇ-ఇస్లామీ, అన్సరుల్లా బంగ్లా టీమ్(ఏబీటీ)తో ఇతర నిషేధిత గ్రూపుల ప్రత్యక్ష మద్దతు ఉన్నట్లు నిఘా వర్గాలు సూచిస్తున్నాయి. ఎల్ఈటీ సహకారంతో ఏబీటీ 2022లో భారత్‌లో దాడులు చేయటమే లక్ష్యంగా బెంగాల్‌లో స్థావరాన్ని స్థాపించినట్లు నిఘా అధికారులు తెలిపారు. త్రిపురలోని హిందూ మెజారిటీ ప్రాంతాలు లక్ష్యంగా చేసుకోవడానికి ఎల్ఈటీ ఏబీటీతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నట్లు గతంలో ఇంటెలిజెన్స్‌కి సమాచారం వచ్చింది. దాదాపు 50 నుండి 100 మంది ఏబీటీకి చెందిన ఉగ్రవాదులు త్రిపురలోకి చొరబడాలని యోచిస్తున్నాయని 2022లో నిఘా వర్గాలు గుర్తించాయి. అదే ఏడాది ఏబీటీతో సంబంధం ఉన్న అనేక మంది ఉగ్రవాదులను అస్సోం పోలీసులు అరెస్టు చేశారు.

ఆర్థిక వ్యవస్థ అస్థిరతకు కుట్ర: రవిశంకర్

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లు కుప్పకూలిపోవాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతోందని బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ ఎదురుదాడికి దిగారు. అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై ఆరోపణలు చేసింది. మాధవి పురి వ్యవహారంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నారు. అదానీ గ్రూప్‌లో ఆమె పెట్టుబడుల వ్యవహారంపై నిజానిజాలు నిగ్గుతేల్చడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల విమర్శలపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. తాజాగా రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అస్థిరత, ద్వేషం సృష్టించడానికి కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. 'మూడోసారి కూడా కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలు కావటంతో ఆ పార్టీ, టూల్‌కిట్ గ్యాంగ్ భారత ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచాలని కుట్ర చేస్తోంది. కాంగ్రెస్ ప్రస్తుతం దేశంలో ద్వేషాన్ని పెంచాలని భావిస్తోంది. నేడు భారత స్టాక్ మార్కెట్లు స్థిరంగా ఉండటం పట్ల గర్వపడుతున్నాం. చిన్నమొత్తాల పెట్టుబడిదారులకు సెల్యూట్ చేస్తున్నా. పెట్టుబడిదారులకు టూల్‌కిట్, హిండెన్‌బర్గ్ నివేదికలపై నమ్మకం లేదు' అని అన్నారు.

మోదీ విధానాలు పేదలకు వ్యతిరేకం

- పోరుబాటుకు సిద్ధం కావాలి
- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమావేశంలో రామకృష్ణ, జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: మోదీ విధానాలు వ్యవసాయ కూలీలు, పేదలకు వ్యతిరేకమని, బీజేపీ ప్రభుత్వంపై పోరాటాలకు కూలీలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన విజయవాడ దాసరి నాగభూషణరావు భవన్‌లో సోమవారం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ, జేడీయూ పార్టీలు ఎన్డీఏలో చేరకపోతే మోదీ ప్రధానమంత్రి అయ్యేవారు కాదన్నారు. మిత్రపక్షాల బలహీనతలే బీజేపీకి బలంగా మారాయని చెప్పారు. మోదీ సారథ్యంలో దేశం ముందుకు పోతుందని కొందరు ఊదరగొడుతున్నారని, కానీ పేదరికం, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యల విషయంలో ముందున్నామని ఎద్దేవా చేశారు. పారిస్ ఒలిపింక్స్‌లో పతకాల పట్టిక చూస్తే ఇండియా స్థానం ఏమిటో అర్థమవుతోందన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశానికి ఒక్క బంగారు పతకం కూడా రాలేదన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒక్క ముస్లిం నేత మంత్రిగా, ఎమ్మెల్యేగా లేరని చెప్పారు. సెబి చైర్‌పర్సన్‌కి అదానీ కంపెనీల్లో షేర్లు ఉన్నాయని హిండెన్‌బర్గ్ ఆరోపిస్తే... దేశంలో కొందరు కంగారు పడిపోతున్నారన్నారు.

రాష్ట్రంలో ఐదేళ్లు పరిపాలించిన జగన్ తన చుట్టూ రెడ్లను నియమించుకుని సామాజిక న్యాయం పాటిస్తున్నానని నమ్మించారని రామకృష్ణ విమర్శించారు. చంద్రబాబు శ్వేతపత్రాలతో జగన్ మోహన్‌రెడ్డి చేసిన అప్పుల గుట్టు అందరికీ తెలిసిందన్నారు. దీంతో ఏపీకి అప్పు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావటం లేదన్నారు. డబ్బులు లేవని తెలిసినా చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారని, ఆ హామీలు నేరవేర్చాలని ప్రజల నుంచి ఒత్తిడి వచ్చి తీరుతుందన్నారు. వ్యవసాయ కార్మికులు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో విభజన హామీల అమలుకు చంద్రబాబు ప్రయత్నించాలన్నారు. ప్రత్యేక హోదా కోసం పట్టుపట్టాలని, కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీల అమలు కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళనలకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మికుల సమస్యలను గుర్తించాలని, గ్రామాల్లో సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలపై నిలదీయాలన్నారు. వ్యవసాయ కూలీలను కూడగట్టాలని గ్రామాల్లో స్థానిక సంస్థల్లో పోటీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. పేదల అధీనంలో ఉన్న సాగు భూములు, ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని జల్లి విల్సన్ విమర్శించారు. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో నియమించిన కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సుల ఆధారంగానే భూ సమస్యలు పరిష్కరించాలన్నారు.

గత కార్యక్రమాలు, భవిష్యత్ కార్యక్రమాన్ని సమావేశంలో ప్రవేశపెడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని, ఆగస్టు 16 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో వ్యక్తిగత అర్జీలు, దరఖాస్తులు ఇవ్వాలని, ఇందుకు వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు అండగా ఉండాలని సూచించారు. పేదలు సాగు చేసుకుంటున్న అన్ని రకాల ప్రభుత్వ భూములకు పూర్తి హక్కులు సాధించేందుకు ప్రత్యక్ష ఆందోళనకు పూనుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలు చేయాలని, అటవీ హక్కుల చట్టం ఆధారంగా పోడు భూములపై హక్కులు కల్పించాలని ఆందోళనలు చేయాలన్నారు. సంఘం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను అక్టోబరు చివరి నాటికి జరపాలని నిర్ణయించారు.

ముందుగా ఇటీవల మరణించిన పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి రాష్ట్ర కార్యాలయం కోశాధికారి రామచంద్రరావు, వయనాడ్ మృతులకు, సీపీఐ అనంతపురం జిల్లా మాజీ కార్యదర్శి ఎంవీ రమణ, వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా కార్యదర్శి ఎం.విజయ్ కుమార్ మృతికి సమావేశం సంతాపం ప్రకటించింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు భూ సమస్యలు, ఉపాధి హామీ, ఇళ్ల స్థలాలు, విద్య, వైద్యం, ఆహార భద్రత తదితర అంశాలపై మాట్లాడారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్లు బి.కేశవరెడ్డి, సీహెచ్ ప్రభాకర్, టి మధు, తోపు క్రిష్టప్ప, కాబోతు ఈశ్వరరావు, చిలుకూరి వెంకటేశ్వరరావు, ఆర్.విజయ, రామునాయుడు, లండ వెంకట్రావు, ఆనందరావు, ఎం.నబీరసూల్, రాధాకృష్ణ, పండుగొల మణి, భూపేశ్, రమణయ్య, ఉప్పెన నరసింహారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో ప్రపంచబ్యాంక్ ప్రతినిధుల భేటీ

అమరావతి నిర్మాణంపై చర్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు భేటీ అయ్యారు. సచివాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సీఆర్డీయే కమిషనర్ కాటంనేని భాస్కర్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. నలుగురు సభ్యులతో కూడిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం గత మూడు రోజులుగా అమరావతిలో పర్యటిస్తోంది. ఈ బృందంలో ప్రపంచ బ్యాంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సీనియర్ స్పెషలిస్ట్ రఘు కేశవన్, లీడ్ ట్రాన్స్పోర్ట్ స్పెషలిస్ట్ గెరాల్డ్ పాల్ ఆలీవియర్,సీనియర్ అర్బన్ స్పెషలిస్ట్ కింగ్ యున్ షెన్, సౌత్ ఏషియా అర్బన్ ప్రాక్టీస్ మేనేజర్ అబేదాలి రజాక్ ఎఫ్.ఖలీల్ ఉన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా శనివారం విజయవాడ వచ్చిన ప్రపంచ బ్యాంక్ బృందం మధ్యాహ్నం వరకూ విజయవాడ సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. సీఆర్డీయే గురించి అమరావతి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి గురించి అధికారులు బృందానికి వివరించారు. శనివారం మధ్యాహ్నం అమరావతిలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. రెండో రోజు ఆదివారం రాజధానిలోని రోడ్లను, కొండవీటి వాగు ఎత్తిపోతల పంప్ హౌస్ ను పనులను పరిశీలించడంతో పాటు విట్, ఎస్ఆర్ఎం, ఎయిమ్స్ లను పరిశీలించారు. సోమవారం సెక్రటేరియట్ లో సీఎం చంద్రబాబుతో ప్రపంచబ్యాంక్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి నిర్మాణంలో ఎలా ముందుకెళ్తుందనేదానిపై బ్యాంక్ ప్రతినిధులకు సీఎం వివరించారు. ప్రపంచంలోని ఉత్తమ ప్రమాణాలు, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని అమరావతి నిర్మాణం చేపడుతున్నట్లు సీఎం చంద్రబాబు వివరించారు.

అదానీ గుప్పిట్లో సెబీ, షేర్ మార్కెట్, మోదీ సర్కార్

సీపీఐ నేత వినయ్ విశ్వం

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ తాజా నివేదికలో సెబీ చీఫ్‌పై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తిన క్రమంలో తక్షణమే ఆమె పదవి నుంచి వైదొలగాలని సీపీఐ నేత వినయ్ విశ్వం డిమాండ్ చేశారు. ఈ నివేదికలో బహిర్గతమైన విషయాలతో మాధవి పురి బుచ్ సెబీ చీఫ్ పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని అన్నారు. ప్రభుత్వం, సెబీ, షేర్ మార్కెట్‌లను అదానీ, ఆయన కంపెనీ నియంత్రిస్తోందని విమర్శలు గుప్పించారు. న్యాయం, సత్యం పట్ల ఆమెకు ఏమాత్రం విశ్వాసం ఉన్నా సెబీ చీఫ్ పదవి నుంచి మాధవి పురి బుచ్ వైదొలగాలని ఆయన కోరారు. కాగా, అదానీ విదేశీ ఫండ్లలో సెబీ చీఫ్, ఆమె భర్తకు వాటాలున్నాయని షార్ట్ సెల్లింగ్ సంస్థ, మార్కెట్ రీసెర్చి కంపెనీ హిండెన్‌బర్గ్ తాజా నివేదిక దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. కార్పొరేట్ కంపెనీల ముందు ప్రస్తుత ప్రభుత్వం ఎలా సాగిలపడుతున్నదనే వివరాలను హిండెన్‌బర్గ్ నివేదిక బహిర్గతం చేసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతపై సీపీఐ ఆందోళన

మత సామరస్యానికి తాత్కాలిక ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో మైనారిటీ వర్గాలపై దాడులు జరగడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండించింది. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం రద్దయ్యాక మైనారిటీ వర్గాలు ఎదుర్కొంటున్న దాడులపై ఆందోళనను వ్యక్తం చేస్తూ సీపీఐ జాతీయ సమితి సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితికి దారితీసిన విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో కొన్ని ఛాందసవాద గ్రూపులు తమ మతతత్వ, విభజన ఎజెండాను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై తాత్కాలిక ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా దేశంలో సామరస్యం వెల్లివిరిసేలా చర్యలు చేపట్టాలని సీపీఐ కోరుతోంది. ప్రొ. ముహమ్మద్ యూనుస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం లౌకిక ప్రజాస్వామ్య సిద్ధాంతం ప్రకారం అన్ని మతాలకు చెందిన మైనారిటీల భద్రతను నిర్ధారించాలి. అన్ని వర్గాలు సమైక్యంగా పోరాడిన బంగ్లాదేశ్ విముక్తి పోరాట వారసత్వంపై ఛాందసవాద శక్తులు విజయం సాధించకూడదు. బంగ్లాదేశ్‌లో ప్రజాగ్రహాన్ని ఛాందసవాద శక్తులు తమకు అనుకూలంగా మార్చుకోకుండా అక్కడి లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులు అడ్డుకోవాలని, మత సామరస్యానికి కృషి చేయాలని కూడా విజ్ఞప్తి చేసింది. పొరుగు దేశంలో మైనారిటీలు సురక్షితంగా ఉండేలా చూసేందుకు భారత ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సీపీఐ కోరింది. కాగా బంగ్లాదేశ్‌లోని పరిస్థితిని భారతదేశంలో మత విభజనకు ఉపయోగించుకునే ప్రయత్నాలు జరగవచ్చుని సీపీఐ హెచ్చరించింది. భారత్‌లో మతపరమైన ఉద్రిక్తతలకు ఆజ్యం పోసే ప్రయత్నాన్ని అడ్డుకోవడానికి భారత ప్రభుత్వం, అన్ని లౌకిక-ప్రజాస్వామ్య శక్తులు కృషి చేయాలని తెలిపింది.

వడ్డీతో నడ్డి విరుగుతోంది!

- ఏజెన్సీలో జోరుగా ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారం
- రుణాల షరతుల ఉచ్చులో అమాయకులు
- రూ.కోట్లలో లావాదేవీలు

విశాలాంధ్ర-కుక్కునూరు: ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం ఏజెన్సీ ప్రాంతంలో కీర్తన, స్పందన వ్యాపారం జోరుగా సాగుతోంది. మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్థిల్లుతోంది. ఒక్కో జోడికి రూ.30 వేలు నుంచి రూలక్ష వరకు ముట్టచెబుతున్నారు. ఏంటి... ఇది కాస్త వినడానికి విడ్డూరంగా, ఆశ్చర్యంగా ఉందే అని అనుకుంటున్నారా... అలాగైతే మీరు పొరబడినట్టే. అసలు ... కీర్తన, స్పందన ఎవరు. ఏజెన్సీలో వారి వ్యాపారమేమిటో తెలుసుకుందాం.

కొంతకాలంగా కీర్తన, స్పందన పేరిట ఉన్న ఫైనాన్స్ కంపెనీలు పోలవరం ముంపులో ఉన్న కుక్కునూరు మండలంలోని ఏజెన్సీపై కన్నేశాయి. జోరుగా రుణాలు ఇస్తున్నారు. తొలుత ఏజెంట్లు గ్రామాల్లో తిరిగి రుణాలు ఇచ్చేందుకు అర్హులైన లబ్ధిదారుల రేషన్, ఆధార్, పాన్ కార్డుల నకళ్లతో పాటు ఇంటి పన్ను, విద్యుత్ బిల్లుల రశీదులను సేకరిస్తున్నారు. అనంతరం వివరాలు తమ కార్యాలయానికి పంపి పక్కా సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలను అర్హులైన భార్యభర్తలకు మాత్రమే ఇస్తున్నారు. 20 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు అర్హులైన వారికి మాత్రమే... రూ.30 వేలు నుంచి రూ.లక్ష వరకు రుణాలు ఇస్తున్నారు. అర్హులైన భార్యభర్తల 10 జోడీలను ఒక గ్రూప్ సభ్యులుగా ఏర్పాటు చేస్తారు. రుణం ఇచ్చే ముందు గ్రూప్ సభ్యులకు సంస్థ ఏజెంట్లు సమావేశం నిర్వహిస్తారు. రుణం మంజూరుకు నిబంధనలు, షరతులు విధిస్తున్నారు. అవసరాలను ఆసరాగా చేసుకుని అమాయక ప్రజలకు రుణాలను అంటగడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్థిక పరిస్థితి రీత్యా సామాన్యులే ఈ ఫైనాన్స్ ఉచ్చులో పడతన్నారనే విమర్శలు హల్‌చల్ చేస్తున్నాయి. రుణాన్ని నెలసరి వాయిదాల ప్రకారం చెల్లించే విధంగా ఫైనాన్స్ సంస్థలు... గ్రూప్ సభ్యులతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. వడ్డీ అధికంగా తీసుకుంటూ పేదల నడ్డి విరుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కీర్తన, స్పందన ఫైనాన్స్ సంస్థలు కోట్లల్లో తమ ఆర్థిక లాలాదేవీలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. కాగా కుక్కునూరు మండలం పోలవరం ముంపులో ఉండటంతో డ్వాక్రా రుణాలు సైతం బ్యాంకులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ముంపు గ్రామాల్లో ఆ సంస్థలు రుణాలు ఇవ్వడం వెనుక మతలబు ఏమిటోనని పలువురు డైలమాలో పడ్డారు. కేవలం సిబిల్ స్కోర్ ఆధారంగా చేసుకుని ఆధార్ కార్డుల నకళ్లతో రుణాలు ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలో చాపకింద నీరులా విస్తరిస్తున్న కీర్తన, స్పందన ఫైనాన్స్ సంస్థలకు అనుమతులు ఉన్నాయా... ఏజెన్సీలో కోట్లల్లో వడ్డీ వ్యాపారం చేయడానికి రూల్స్ ఉన్నాయా అన్న అనుమానాలు నివృత్తి కావాలంటే ఈ ఫైనాన్స్ సంస్థలపై పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దిగువకు తుంగభద్ర నీరు

జలాశయానికి తాత్కాలిక గేటు ఏర్పాటుకు చర్యలు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: తుంగభద్ర జలాశయం 19 గేటు చైను తెగిపోవడంతో తుంగభద్ర జలాశయం నుంచి భారీగా నీరు దిగువకు వెళుతోంది. క్రస్ట్ గేటుకు మరమ్మతులు చేయాలంటే సగానికి పైగా నీటిని ఖాళీ చేయాల్సి ఉంది. దీంతో సోమవారం లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఒక్కరోజే 8 టీఎంసీల నీరు వృథాగా పోయింది. అయితే తుంగభద్ర బోర్డు అధికారులు వేగంగా పనులు చేస్తున్నారు. త్వరగా పూర్తి చేయాలని ఉద్దేశంతో సోమవారం సాయంత్రానికి 1.50 లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు నిర్ణయించారు. క్రస్ట్ గేటు కొట్టుకోపోవడంతో నీరు బయటకు వెళ్లకుండా నిరోధించడానికి అదే స్థానంలో తాత్కాలిక స్టాప్ లాక్ గేటును ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తుంగభద్ర పైనే గంపెడాశలు

అనంతపురం జిల్లాకు జీవనాడి అయిన తుంగభద్ర జలాశయం పైనే ఇక్కడి రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. జలాశయం వరద నీటితో వేగంగా నిండిపోవడంతో రైతులు ఆనందపడ్డారు. అయితే 19వ గేటు కొట్టుకుపోవడంతో నీరు వృథా కావడం వల్ల వారు నిరాశకు గురయ్యారు. ఇప్పటికే వరి నారు సిద్ధం చేసుకుని నాట్లు వేస్తున్న తరుణంలో తుంగభద్ర జలాశయం గేటు తెగిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి కోసం అప్పులు చేసి సేద్యం చేసిన తరుణంలో జలాశయానికి చేరిన నీరు వృథా అవుతుండడంతో ఈ ఏడాది పంట పండిస్తామా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు గత ఏడాది ఖరీఫ్, రబీలోనూ పంట దిగుబడి కోల్పోయి తీవ్ర నష్టాల్లో ఉన్నామని, ఈసారి వరద నీరు ముందుగా రావడంతో ఆశలు చిగురించాయన్నారు. కానీ అంతలోని గేటు తెగిపోయి నీరు వృధాగా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు నీరు వృధా కాకుండా నిల్వ చేయాలని కోరుతున్నారు.

100 రోజుల్లో పారిశ్రామిక విధానం

15 శాతం వృద్ధి రేటు లక్ష్యం: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే 100 రోజుల్లో పారిశ్రామిక విధానానికి ముఖ్య పాలసీలు తేవాలని, నూతన పారిశ్రామిక విధానం రూపకల్పనలో నీతి అయోగ్ ఆలోచనలనూ పరిగణలోకి తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. దేశంలో టాప్-5 రాష్ట్రాలతో పోటీపడే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానం ఉండాలని సూచించారు. త్వరలో అమల్లోకి తేనున్న నూతన పారిశ్రామిక విధానం 2024-29పై రూపొందించిన ముసాయిదా విధానాన్ని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, అధికారులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబుకు వివరించారు. సీఎం మాట్లాడుతూ గతంలో రాష్ట్రానికి ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు.15 శాతానికిపైగా వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా నూతన పాలసీ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా, రాష్ట్రంలో 10 ఓడరేవులు, 10 విమానాశ్రయాలు, మెరుగైన రోడ్డు రవాణా, లాజిస్టిక్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి ఇవి ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయని చెప్పారు. గ్రీన్‌ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఆక్వా, ఆహారశుద్ధి వంటి రంగాల్లో పెద్దఎత్తున పరిశ్రమల స్థాపన జరిగేలా నూతన పారిశ్రామిక విధానం రూపొందించాలని చెప్పారు. ఈనెల 16న పారిశ్రామిక వేత్తలతో సమావేశం కానున్నామని, 23న మళ్లీ నూతన పారిశ్రామిక విధానంపై మరోసారి సమావేశమవుదామని అధికారులకు చెప్పారు. గతంలో కర్నాటకకు వెళ్లిన హీరో మోటార్స్, తెలంగాణకు వెళ్లిన అపోలో టైర్స్ సంస్థలను ఏపీకి తీసుకువచ్చామని గుర్తుచేశారు. అంతకుముందు రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్... ప్రతిపాదిత పారిశ్రామికాభివృద్ధి ముసాయిదాలో పొందుపర్చిన అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కమిషనర్ సిహెచ్.శ్రీధర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్ పాల్గొన్నారు.

పోటీపై కూటమిలో వీడని సస్పెన్స్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక విషయంలో అభ్యర్థి ఎంపికపై టీడీపీ కూటమిలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. మంగళవారం నామినేషన్ దాఖలుకు తుది గడువు కాగా సోమవారం రాత్రి 10 గంటల వరకు అసలు పోటీ చేస్తారా ? లేదా ? పోటీ చేస్తే అభ్యర్థి ఎవరు ? అనే విషయాలపై కూటమిలో స్పష్టత రాలేదు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల బలం వైసీపీకి రెండింతలు అధికంగా ఉండడంతో నైతికంగా పోటీ చేయడం సరికాదనే భావనలో సీఎం చంద్రబాబు ఉన్నట్లు సమాచారం. అయితే స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు, ఉత్తరాంధ్ర మంత్రులు మాత్రం పోటీ చేస్తే గెలుస్తామని చెపుతున్నారు. టీడీపీ నేతలు గండి బాబ్జీ, పీలా గోవింద్, బైరా దిలీప్ టికెట్ రేసులో ఉండగా... వీరిలో ఇటీవల అనకాపల్లి లోక్‌సభ టికెట్ ఆశించి భంగపడిన బైరా దిలీప్ చక్రవర్తి ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తుంది. విశాఖ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, నేతలతో సీఎం చంద్రబాబు వరుస సమావేశాలు నిర్వహించి... గెలుపు అవకాశాలపై ఆరా తీశారు. కానీ పోటీ చేసే విషయం, అభ్యర్థి ఎంపికపై టీడీపీ అధినేత ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. విశాఖ స్థానిక సంస్థల నియోజకవర్గంలో మొత్తం 840 ఓట్లు ఉండగా, 11 ఖాళీలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీకి 615 మంది ప్రజాప్రతిధులు ఉండగా, టీడీపీకి 214 మంది మాత్రమే ఉన్నారు. వీరుగాక వైసీపీకి చెందిన సుమారు 80 మంది టీడీపీకి టచ్‌లో ఉన్నారు. అయినప్పటికీ గెలుపునకు అవసరమైన బలం లేకపోవడంతో కూటమి పోటీ చేసే విషయంపై తేల్చుకోలేకపోతోంది.

చత్తీస్‌గఢ్ విలేకరులపై అక్రమకేసు

సమగ్ర దర్యాప్తునకు ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చత్తీస్‌గఢ్‌కు చెందిన నలుగురు విలేకరులపై పెట్టిన అక్రమ గంజాయి కేసు ఎత్తివేయాలని, అరెస్టు చేసిన విలేకరులను వెంటనే విడుదల చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఐజేయు జాతీయ కార్యదర్శి డి. సోమసుందరం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లో శబరి నదిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై సదరు విలేకరులు వార్తలు రాస్తుండటంతో ఇసుక మాఫియా ముఠా ఆంధ్రా పోలీసులతో కుమ్మక్కై విలేకరులపై గంజాయి అక్రమ రవాణా కేసు బనాయించినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వార్తా సేకరణకు వచ్చిన ఆరుగురు విలేకరులను కుంట పోలీసులు ప్రశ్నించే పేరుతో పోలీసు స్టేషన్ కు తీసుకు వెళ్లారని, వారు పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడటంతో విడిచిపెట్టారని తెలిపారు. అయితే వారు ప్రయాణిస్తున్న కారును ఆంధ్ర సరిహద్దులో చింతూరు పోలీసులు ఆపి తనిఖీ చేయగా అందులో 40 కేజీల గంజాయి లభ్యం కావడంపై అనుమానాలున్నాయని చెప్పారు. పోలీసులే విలేకరుల కారులో గంజాయి పెట్టినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు.

శ్రీశైలం డ్యామ్ గేట్లు మూసివేత

విశాలాంధ్ర-శ్రీశైలం: కృష్ణానది పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గిపోయింది. దీంతో సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో జలాశయం గేట్లను మూసివేశారు. వరద ప్రవాహం తగ్గడంతో ఉదయం నుంచి ఒక్క గేటు ద్వారా మాత్రమే నీటి విడుదల చేపట్టారు. సాయంత్రానికి వరద ప్రవాహం పూర్తిగా తగ్గిపోవడంతో ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి ఆ ఒక్క గేటును కూడా సాయంత్రం మూసి వేశారు. గేట్లు మూసి వేయడంతో పర్యాటకుల సందడి పూర్తిగా తగ్గిపోయింది.

విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలి

కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి

విశాలాంధ్ర-కడపరూరల్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ వార్షికోత్సవాల సందర్భంగా కడపలోని మెయిన్ స్కూల్లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జీ ఈశ్వరయ్య హాజరయ్యారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు రాజకీయాల్లోకి వస్తేనే ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ... దేశంలో విద్యా వ్యవస్థ విచ్ఛిన్నమవుతోందని... దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల మీదే ఉందన్నారు. కాబట్టి విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా వైద్య, సాంకేతిక విద్యలో శాస్త్రీయత లేకుండా భావాలను పెంపొందిస్తున్నారని... నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ... 117జీవో రద్దు చేయాలని... యూనివర్సిటీ కేంద్రాలలో విద్యార్థులకు స్వేచ్ఛనివ్వాలని కోరారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతులగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే మాధవి రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. మాజీ విద్యార్థి నాయకులు ఎల్ నాగసుబ్బారెడ్డి, గుంటి వేణుగోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేశవశంకర్, గుజ్జుల వలరాజు, నగర అధ్యక్షులు అరుణ్ అకిరానంద్ తేజ, చంద్ర, లక్ష్మి, నిఖిత, మస్తాన్ రాజేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత పని కేటాయించండి

సీఎంకు ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థలో వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులకు నిర్దేశించిన పనిని కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య సోమవారం లేఖ రాశారు. ఉద్యోగానికి డిగ్రీ అర్హత పెట్టి ఉద్యోగం పొందిన తర్వాత ఏడు లేదా 10వ తరగతి చదివిన మేస్త్రి, పారిశుధ్య పరిశీలకుల విధులను అప్పనంగా చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవస్థకు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శి అవసరం లేదన్నారు. 423 జీవో రద్దుచేసి సచివాలయం సమయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పని చేయించాలని కోరారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.